OSA EMBROIDERY
SALES AND SERVICES
All embroidery machines sales and service available from Vizag to Andhrapradesh, Telangana, Odisha, Tamilnadu
Proprietor. Sudheer
Cell : 8919001428, 8985648864
E:osaemboiderymachine@gmail.com

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 295 విశాఖపట్నం, 10 సెప్టెంబరు 2023 ఆదివారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## తొలిసారిగా అంతర్జాతీయ ఆతిథ్యం

### జీ20 శిఖరాగ్ర సమావేశాలు ప్రారంభించిన మోదీ




ఢిల్లీలోని ప్రగతి మైదాన్ లో జీ-20 సదస్సు ప్రారంభమైంది. భారత్ తొలిసారిగా అతిథ్యమిస్తున్న జీ-20 శిఖరాగ్ర సదస్సు భారత్ మండపం వేదికగా అట్టహాసంగా కొనసాగుతోంది. ప్రపంచ దేశాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం తన ప్రసంగంతో మోదీ సదస్సును ప్రారంభించారు. జీ20 సదస్సు వేదికగా భారత్ వెలిగిపోయింది. కేంద్ర ప్రభుత్వం ఇండియా పేరును భారత్ గా మార్చేన సంగతి తెలిసిందే. ఇందుకు నిదర్శనంగా ఇప్పటికే జీ 20 సదస్సుకు ఆహ్వానిస్తూ రాష్ట్రపతి, ప్రధానిలకు పంపిన ఒక ఆహ్వాన పత్రం భారత్ పేరుతో పంపించారు. ఇక ఇప్పుడు తాజాగా జీ20 సదస్సులో ఎక్కడ చూసిన భారత్ అనే పేరు ప్రత్యక్షమైంది. ప్రధాని ప్రసంగించిన పోడియం, మైకులకు కూడా ముందు భాగంలో భారత్ అని కనిపించింది. జీ20 ప్రతినిధులను ఉద్దేశిస్తూ ప్రధాని మోదీ ప్రసంగిస్తున్న చైర్ వద్ద ఉన్న నేమ్‌ప్లేట్‌పై భారత్ అని రాసి ఉంది. మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభిస్తూ.. భారత్ మిమ్మల్ని స్వాగతిస్తోందని ప్రసంగించారు. ఓ అంతర్జాతీయ మీటింగ్‌లో మన దేశాన్ని ఇండియాకు బదులుగా భారత్ అని రాయడం ఇదే తొలిసారి.

జీ20 సదస్సు తొలిరోజు తొలి సెషన్ ప్రారంభమైంది. ప్రపంచ నేతలకు ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతం పలికారు. మొరాకో భూకంపంపై మొదట మాట్లాడారు ప్రధాని మోదీ. అక్కడ సంభవించిన భూకంపంలో సుమారు 300 మంది మరణించారు. ఈ దుఃఖ సమయంలో (మిగతా 2లో)

## మంచి విద్య మాత్రమే మెరుగైన భవిష్యత్తుకు పునాది



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మంచి విద్య మెరుగైన భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. శనివారం మధ్యాహ్నం ఏయూ కట్టమంచి రామలింగా రెడ్డి స్నాతకోత్సవ మందిరం వేదికగా ఏయూ 87,88,89,90ల సంయుక్త స్నాతకోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా ముఖ్య అతిధి జి.ఎం రావుకి వర్సిటీ డాక్టర్ ఆఫ్ సైన్సు ప్రధానంచేసారు. అనంతరం డాక్టర్ ఆఫ్ లిటరేచర్ ఆచార్య కొలకలూరి ఇనాక్కి, డాక్టరాఫ్ సైన్సు అల్లూరి ఇంద్రకుమార్లకు ప్రధానం చేసారు. అనంతరం విశ్వవిద్యాలయ ఛాన్సలర్గా ఎస్.అబ్దుల్ నజీర్ స్నాతకోత్సవాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ జ్ఞానం అంత:దృష్టి కలిగి ఉండటంతో పాటు దానిని నైతికతను జోడిస్తేనే దాని విలువ ద్విగుణీకృతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పిన మాటను ఉదహరిస్తూ ' జీవితకాల అభ్యాసకులుగా నిలవాలని, మీకు ఉండే అత్యంత విలువైన సంపద మీ మనస్సు, దీనిలో దేనిని నింపుతున్నామనేది ప్రధానం' అని అన్నారు. నేటి మీ ప్రయత్నం రేపటి ఫలితాలను ప్రభావితం చేస్తుందనే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. వ్యక్తులు తమ ప్రగతితో పాటు సమాజాభివృద్ధికి కృషిచేయాలన్నారు.

విశ్వవిద్యాలయం అన్ని వర్గాల విద్యార్థులను స్వాగతించి స్థానం కల్పిస్తుందనారు. అట్టడుగు, దిగువ మధ్యతరగతి వారి మార్పుకు విద్య చోదక శక్తిగా నిలుస్తోందన్నారు. సమాజంలో వెనుకబడిన వారి అవసరాలను పరిష్కరిస్తుందన్నారు. ఈ ప్రక్రియలో విశ్వవిద్యాలయాల ఆచార్యులు తమ భుజాలపై బాధ్యతను స్వీకరించాలన్నారు. ఉన్నత విద్యలో రాణించాలనే ఉన్నత సంకల్పంతో సాధారణ కుటుంబాల నుంచి (మిగతా 2లో)

## నారాయణ జపంలోనే ఆత్మానందం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నారాయణ నామజపంలోనే జీవం ఉందని, ఆనందమే ప్రధాన లక్ష్యంగా శ్రీ వేంకటేశ్వరస్వామి తన నివాసానికి ఆనంద నిలయంగా నామకరణం చేసుకున్నారని సాక్షాత్తు అన్నమాచార్యుల వారి 13వ తరం మనుమడు శ్రీమాన్ తాళ్లపాక నారాయణాచార్యులు అన్నారు. శనివారం మధ్యాహ్నం ఎంవీపీ కోలనీలోని ప్రఖ్యాత వేదాంగ జ్యోతిష్య పండితులు శ్రీమాన్ కందాళ వేంకట సత్యశ్యామ్ నివాసానికి భిక్షకై వచ్చిన ఆయన అక్కడ గుమిగూడిన భక్తులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. భక్తులు అడిగిన వివిధ ఆధ్యాత్మిక సందేహాలకు సమాధానం ఇచ్చారు. శంకరులపైన, వేంకటేశ్వర స్వామిపైన కీర్తనలు ఆలపించారు.

ఈ సందర్భంగా శ్రీమాన్ నారాయణాచార్యులు మాట్లాడుతూ ధర్మం అనేది ఒక్కటే ప్రపంచాన్ని నడిపిస్తుందని, ధర్మాన్ని ఆచరించే వారినే భగవంతుడు కూడా ప్రేమిస్తాడని, తన ప్రేమను అందిస్తాడని అన్నారు. అధర్మం తాత్కాలిక ప్రయోజనాలను, దురాశను ప్రేరేపిస్తుందని, క్షణ భంగుర విజయాలను కల్పిస్తుందని, క్రమేణా అవన్నీ మాయమై అటువంటి వ్యక్తులు దుర్భరమైన జీవితం గడపవలసి వస్తుందని అన్నారు. రావణాసురుడు, (మిగతా 2లో)

## మేడపాటి రవీంద్రకు ఎంపీ జీవీఎల్ అభినందన

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** భారతీయ జనతా పార్టీ విశాఖపట్నం జిల్లా శాఖ నూతన అధ్యక్షుడిగా మరోసారి నియమితులైన మేడపాటి రవీంద్రారెడ్డిని ఈరోజు బిజెపి ఎంపీ శ్రీ జీవీఎల్ నరసింహారావు గారు బిజెపి జిల్లా కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. పార్టీ పట్ల క్రమశిక్షణ,అంకితభావం, మరియు పార్టీలో అందరిని కలుపుకుపోయే తత్వమున్న మేడపాటి రవీంద్ర రెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఇంతకుముందు తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించినందు వల్లే మరోసారి జిల్లా అధ్యక్షుడిగా అవకాశం వచ్చిందనీ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో రెండోసారి (మిగతా 2లో)



## డీఆర్ఎం కార్యాలయంలో విజిలెన్స్ వర్క్‌షాప్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శనివారం విశాఖపట్నంలోని డిఆర్ఎం ఆఫీస్‌లోని కంట్రోల్ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రివెంటివ్ విజిలెన్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించబడింది. ప్రివెంటివ్ విజిలెన్స్‌పై కీలక గమనికను పి.పి. సిన్హా డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, ఈస్ట్ కోస్ట్ రైల్వే. సదస్సుకు విశాఖపట్నంలోని వాల్టెయిర్ డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ శ్రీ రంజన్ మొహంతి అధ్యక్షత వహించారు.

సమావేశాన్ని ఉద్దేశించి సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మొహంతి మాట్లాడుతూ, నివారణ విజిలెన్స్ లోపం సంభవించడాన్ని తగ్గించడం మరియు లోపాన్ని గుర్తించడం & ధృవీకరించడం (మిగతా 2లో)

## శంకర్ ఫౌండేషన్ డీజీఎం బంగార్రాజుకు వైద్యులచే సత్కారం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి లో ( నాయుడు తోట) డిప్యూటీ జనరల్ మేనేజర్ (పి ఆర్ & లైసిన్) గా విధులు నిర్వహిస్తున్న కే. బంగార్రాజు అద్భుత పనితీరు కనపరిచినందుకు ఆసుపత్రి యాజమాన్యం ప్రశంసలను కురిపించింది.

ప్రతి నెల జరిగే ఉద్యోగుల సమావేశములో ఆసుపత్రి జనరల్ మేనేజర్ , కే రాధ కృష్ణన్ , డాక్టర్లు టి రవీంద్ర, నస్రిన్ ,శిరీష, కృష్ణ, సీత మరియు వేణుగోపాల్, కనకరాజు లు బంగార్రాజు ను శాలువాతో (మిగతా 2లో)


## అవినీతి ఆరోపణలతో చంద్రబాబు నాయుడు అరెస్టు

**కర్నూలు :** అత్యంత నాటకీయ పరిణామాల మధ్య తెదేపా అధినేత చంద్రబాబునాయుడిని సీఐడీ పోలీసులు శనివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. చంద్రబాబును అరెస్టు చేస్తారంటూ వార్తలు రావడం.. అనంతపురం నుంచి ఆరు బస్సుల్లో భారీగా పోలీసులు రావడం.. శుక్రవారం అర్ధరాత్రి నుంచి నంద్యాల పట్టణంలో ఉద్రిక్తత నెలకొంది. అరెస్టు చేస్తారన్న సమాచారం అందుకున్న తెదేపా నాయకులు, కార్యకర్తలు భారీగా చంద్రబాబునాయుడు బస చేసిన ఆర్.కె.ఫంక్షన్ హాలు వద్దకు చేరుకున్నారు. పార్టీ నేతలు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మూడు గంటల ప్రాంతంలో చంద్రబాబు బస చేస్తున్న బస్సు వద్దకు పోలీసులు వెళ్లే ప్రయత్నం చేశారు. నేతలు తీవ్రంగా ప్రతిఘటించారు. ఈ సమయంలో ఎందుకు వచ్చారని తెదేపా నాయకులు ప్రశ్నించారు. మీకు సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని.. నేరుగా చంద్రబాబు నాయుడుకే చెబుతామని పోలీసు అధికారులు పేర్కొన్నారు.

దీనిపై నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫంక్షన్ హాలు వద్ద అడ్డుగా ఉన్న వాహనాలను తొలగించి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం చంద్రబాబు నాయుడితో చర్చలు జరిపారు. మాజీ మంత్రి అఖిలప్రియ, మాజీ ఎమ్మెల్యేలు భూమా బ్రహ్మానందరెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, మరికొందరు నాయకులను అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం చంద్రబాబు విశ్రమిస్తున్న బస వద్దకు చేరుకుని బస్సు అద్దాలు గట్టిగా తట్టారు. బాబు బస్సు నుంచి కిందికి రావడంతో పోలీసులు ఆయనతో మాట్లాడారు. చంద్రబాబు మాట్లాడుతూ తన హక్కులను ఉల్లంఘిస్తున్నారని (మిగతా 2లో)



చంద్రబాబుకు పరీక్షలు చేస్తున్న వైద్యులు



## ఆర్టీసి బస్సుల రాకపోకలు నిలవడంతో ప్రయాణికుల ఇబ్బందులు

యలమంచిలి, (విశాఖ సమాచారమ్): టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో జిల్లాలో టిడిపి నేతల నిరసనల దృష్ట్యా యలమంచిలి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి బస్సుల రాకపోకలను పోలీసులు నిలిపివేశారు. తెల్లవారుజామునే పట్టణంలో గల బస్టాండ్ వద్దకు వెళ్లిన పోలీసులు ఆర్టీసీ బస్సులు తిరగకుండా నిలిపివేశారు. ముందస్తు సమాచారం లేకుండా ఉన్నట్టుండి బస్సుల రాకపోకలను నిలిపేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.ప్రతీ రోజు వివిధ పనులపై అనకాపల్లి, విశాఖపట్నం వెళ్లే ప్రయాణికులు శనివారం నాడు అటు ట్రైన్లు అందుబాటులో లేక ఇటు బస్సులు కూడా తిరగకపోవడంతో ఇబ్బంది పడ్డారు.ఎట్టకేలకు మధ్యాహ్నం 12 గంటల నుంచి బస్సులను యధావిధిగా నడపడంతో ప్రయాణికుల అవస్థలు తప్పాయి.

# రైలుకిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



యలమంచిలి, (విశాఖ సమాచారమ్): శనివారం ఉదయం ఆరు గంటల ముందర సమయంలో నర్సింగ్ పల్లి ఎలమంచిలి రైల్వే స్టేషన్ల మధ్య ఎలమంచిలి రైల్వే గేట్ సమీపంలో అప్ లైన్ ట్రాక్ సుమారు 40 సంవత్సరాలు వయసు కలిగినగుర్తు తెలియని పురుషుడు స్పీడ్ గా వస్తున్న భువనేశ్వర్ నుండి రామేశ్వరం వెళ్ళురైలు బండిని గమనించకుండా రైలు పట్టాలు దాటుతూ ప్రమాదవశాత్తు అక్కడికక్కడే మరణించాడు. ఇతని శరీరం అంతా నుజ్జు నుజ్జు అయింది. ఇతని చేతిపై ఓం త్రిశూలం పచ్చబొట్టు కలిగి ఉన్నాడు. బ్లూ కలర్ లుంగీ రెడ్ కలర్ షర్ట్ ధరించి ఉన్నాడు చామనచాయ రంగులో ఉన్నాడు ఇతని వద్ద ఇంతకన్నా ఎటువంటి ఆధారాలు లభించలేదు మృతుడిని తుని గవర్నమెంట్ ఏరియా ఆసుపత్రి మార్చురీ రూమ్‌లో భద్రపరిచారు. ఇతని యొక్క ఆచూకీ ఎవరికైనా తెలిసిన యెడల తుని గవర్నమెంట్ రైల్వే పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వారిని సంప్రదించవలసిందిగా కోరారు. ఈ కేసును తుని జిఆర్‌పి ఎస్ఐ ఎస్‌కే అబ్దుల్ మారూఫ్ దర్యాప్తు చేస్తున్నారు.

పంచాంగం

ఆదివారం 10-09-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం వర్షరుతువు
శ్రావణ మాసం

తిథి : బ. ఏకాదశి రా. 10.09
నక్షత్రం : పునర్వసు రా. 07.12
వర్జ్యం : ఉ. 06.11 ల 07.53

విశాఖ సమాచారమ్
ప్రతులకు, ప్రకటనలకు
సెల్: 9393949345, 8247526179

## (మొదటి పేజీ తరువాయిలు)

### తొలిసారిగా అంతర్జాతీయ ఆతిథ్యం

ప్రపంచం మొత్తం మొరాకోతో ఉందని భరోసా కల్పించారు. జి20 గ్రూపులో ఆఫ్రికన్ యూనియన్ అధికారికంగా చేరుతున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. యూనియన్ అధ్యక్షుడిని కౌగిలించుకుని అభినందనలు తెలిపారు. మీ అందరి అంగీకారంతో ఆఫ్రికన్ యూనియన్ నేటి నుంచి జి20లో శాశ్వత సభ్యత్వం తీసుకోబోతున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఈ ప్రకటనతో నేతలంతా చప్పట్లు కొట్టారు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆఫ్రికన్ యూనియన్ ప్రెసిడెంట్ అజాలి అసోమానిని వెంట తీసుకువెళ్లారు మరియు పిఎం మోడీ అతనిని ఆలింగనం చేసుకుని ఆత్మీయంగా పలకరిస్తూ కూర్చోబెట్టారు.

జి-20 కార్యకలాపాలను ప్రారంభించే ముందు మొరాకోలో భూకంపం కారణంగా సంభవించిన ప్రాణ, ఆస్తి నష్టంపై తమ సంతాపాన్ని తెలియజేశారు ప్రధాని మోదీ. మొరాకో భూకంపంలో గాయపడిన వారందరూ వీలైనంత త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ క్లిష్ట సమయంలో మొరాకోకు అన్ని విధాలా సహాయం అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందన్నారు. ప్రధాని మోదీ తర్వాత ప్రపంచ నేతలంతా ఒక్కొక్కరుగా తమ అభిప్రాయాలను తెలియజేశారు.

గ్లోబల్ ట్రస్ట్ లోటును ఒక ట్రస్ట్‌గా మార్చాలని జి20 అధ్యక్షుడిగా భారతదేశం మొత్తం ప్రపంచానికి పిలుపునిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. మనమందరం కలిసి కదలాల్సిన సమయం ఇది. అందువల్ల, సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే మంత్రం మనందరికీ మార్గనిర్దేశం చేయగలదన్నారు మోదీ.

### మంచి విద్య మాత్రమే మెరుగైన భవిష్యత్తుకు పునాది

వచ్చే విద్యార్థులను ఉన్నతంగా మలచాలని, వీరు అత్యున్నత శక్తిగా మారి తమ వర్గాలలో అభివృద్ధికి భవిష్యత్తులో దోహదకారిగా నిలుస్తారన్నారు.

ప్రతిష్టాత్మక ఆంధ్రవిశ్వవిద్యాలయం ఉన్నత విద్య జ్ఞాన నిధిగా, దేశంలోని అత్యంత పురాతన విశ్వవిద్యాలయాలలో ఒకటిగా నిలుస్తోందన్నారు. సుదీర్ఘ కాలంగా ప్రగతిని ఏయూ కలగి ఉందన్నారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలకు ఏయూ సిద్ధమవుతోందన్నారు. నేటి ఏయూ ప్రగతికి ఎందరో కృషిచేసారన్నారు.

విశ్వవిద్యాలయం తొలి రోజుల్లో దార్శనికులైన సర్ సి.ఆర్. రెడ్డి, భారత తొలి ఉపరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ, యూజీసీ తొలి చైర్మన్ డాక్టర్ వి.ఎస్. కృష్ణ వంటివారు సారథ్యంలో ఎంతో ప్రగతి సాధించిందన్నారు.

నేడు ఆంధ్రవిశ్వవిద్యాలయం ఒక మల్టీడిసిప్లినరీ విశ్వవిద్యాలయంగా నిలుస్తోందనిఅన్నారు. ప్రపంచ విద్య అవసరాలకు అనుగుణంగా కోర్సులను అందిస్తూ, నూతన విద్యా విధానం 2020ని ఆచరణలో చూపుతూ గ్లోబల్ ట్రెండ్స్కి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతోందన్నారు.తద్వారా యువత ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో అవకాశాలను అందుకునే అవకాశం ఏర్పడుతోందన్నారు. ప్రస్తుత ఏయూ అధికారులు ఒక నవ్య ఆలోచనతో పనిచేస్తూ స్టార్టప్ వ్యవస్థను ఏర్పాటు చేసారన్నారు. నాస్కాం సెంటర్ ఆఫ్ మెషీన్ ఇంటెలిజెన్స్, ఐఓటి, టెక్నాలజీ హబ్గా నెలకొల్పిన ఆ హబ్ ఇప్పటికే 124 అంకుర సంస్థలను స్థానం కల్పించిందన్నారు. ఫార్మ ఇంక్యుబేషన్ బయోలాజికల్ మోనిటరింగ్ సెంటర్ ఎలిమెంట్, మెరైన్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ అవంతి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఏయూ,రోసీస్ డ్రోన్ టెక్నాలజీ సెంటర్, సౌండ్,వీడియో టెక్నాలజీ కేంద్రం ఏయూ ,లూక్స్, సెంటర్ ఫర్ ఫుడ్ టెస్టింగ్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్లు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిలుస్తాయన్నారు. ఏయూ అమలు చేస్తున్న నూతన విధానాలను ఇతర విశ్వవిద్యాలయాలు సైతం అమలు చేస్తే ప్రతిభ కలిగిన యువతను దేశంలో స్థిరపడే విధంగా చేయడం సాధ్యపడుతుంది.

విశ్వవిద్యాలయం కేవలం జ్ఞానాన్ని పెంచడమే కాకుండా సామాజిక బాధ్యతను పెంచే కేంద్రంగా నిలుస్తుందన్నారు. విశ్వవిద్యాలయాల వ్యవస్థాపకుల ఆకాంక్షలను సాకారం చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. దేశ ప్రగతిలో విశ్వవిద్యాలయాల పాత్ర ఎంతో కీలకం, శాస్త్రవేత్తలను తయారు చేయడం,శాస్త్ర అభివృద్ధికి అవసరమైన సాంకేతికతలను అభివృద్ధి చేయడం జరుగుతోందన్నారు. ఏయూలో నెలకొల్పిన సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ పేటెంట్లుసాధించే సామర్థ్యాన్ని పెంచింది. నాక్లో ప్రతీసారి అత్యుత్తమ గ్రేడ్నుసాధించడం శుభపరిణామం, ఏయూ క్రీడా రంగంలో సైతం సాధిస్తున్న ప్రగతి సంతోషాన్నిస్తోంది. జాతీయ స్థాయిలో సాధిస్తున్న పతకాలు విద్యార్థుల ప్రతిభకు అద్దంపడుతున్నాయి.ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సాధిస్తున్న రాష్ట్రపతి పురస్కారాలు, స్వచ్ఛభారత్ను ఆచరణలో చూపుతూ క్లీన్, గ్రీన్ క్యాంపస్గా మలచుతున్న విధానం ప్రత్యేకంగా ప్రశంసించారు. ఏయూ నిర్వహిస్తున్నత యోగా, మ్యూజిక్, డాన్స్, ఫైన్‌ఆర్ట్స్, రంగస్థల కోర్సులు వ్యక్తిలో మానసిక, ఆధ్యాత్మిక పరిణితికి ఉపయుక్తంగా నిలుస్తున్నాయి.

సమగ్ర అభివృద్ధి, విద్యా నైపుణ్యం దిశగా ఆంధ్రవిశ్వవిద్యాలయం అడుగులు వేస్తోందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. స్నాతకోత్సవంలో ఆయన నివేదికను అందించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద రెడ్డి మాట్లాడుతూ నూతన విద్య విధానం 2020కి అనుగుణంగా పరిశ్రమల అవసరాలను అనుగుణంగా, ప్రపంచంతో అనుసంధానం చేస్తూ, సామాజిక బాధ్యతతో మానవ వనరుల అభివృద్ధి దిశగా చేస్తున్న కృషిని వివరించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి దార్శనికతకు అనుగుణంగా ఇంజనీరింగ్, సైన్స్, ఫార్మశీ రంగాలలో ఆవిష్కరణలు జరిపే సౌలభ్యంతో కూడిన మౌళిక వసతులు కల్పన చేస్తూ ఆలోచనల నుంచి ప్రోటోటైప్, కమర్షియలైజేషన్ దిశగా నడిపిస్తున్నామన్నారు.టెక్నాలజీ హబ్గా నెలకొల్పిన ఆ హబ్ 104 స్టార్టప్ సంస్థలను కలిగి వీటిలో 75 శాతం సంపదను సృష్టించే స్థాయికి చేరుకున్నాయన్నారు. భారత ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నెలకొల్పిన నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ 17 స్టార్టప్లకు స్థాణం కల్పించిందన్నారు. అవంతి ఫీడ్స్ సంస్థ నెలకొల్పిన ఏయూ,అవంతి స్కిల్ సెంటర్ అక్వాఫార్మింగ్లో స్కిల్ ట్రైనింగ్ అందిస్తోందన్నారు. రూసా నిధులతో ప్రారంభించిన ఎలిమెంట్ త్వరలో డ్రగ్ రీసెర్చ్,ఫార్మశీ రంగంలో పనిచేస్తుందన్నారు. ఆర్ఐఎన్ఎల్ నెలకొల్పిన బయో ఆర్చర్, సెయింట్ లూక్స్ మ్యూజిక్ ప్రొడక్షన్ల పనితీరు తెలయజేశారు. ఏయూలో నెలకొల్పిన ఇనిస్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ 4 స్టార్ రేటింగ్ సాధించిందని, గత రెండేళ్ల కాలంలో 14 చైర్ ప్రొఫెసర్లను వివిధ జాతీయ, విదేశీ సంస్థల సహకారంతో ఏర్పాటు చేసామన్నారు. ఏయూలో విదేశీ విద్యార్థుల సంఖ్య వెయ్యి మార్కు దాటిందని, 49 దేశాల విద్యార్థులు ఏయూలో చదువుకుంటున్నారన్నారు. యూఎస్ ఎంబసీ ఏయూలో అమెరికన్ కార్నర్ను నెలకొల్పిందని, దీనిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను తెలియజేశారు. ట్రాన్స్ డిసిప్లినరీ హబ్ని నెలకొల్పి జరుపుతున్న నవ్య పరిశోధనలు వివరించారు. ఏయూ డాక్టర్ వి.ఎస్.కృష్ణ గ్రంథాలయంలో తాళపత్రాల డిజిటలైజేషన్ చేసిన విధానం, ఏయూ అంతర్గత మ్యాగ్జైన్ ఏయూ లుక్స్ చేస్తున్న కృషి, అత్యంత విలువైన ఏయూ భూములను అన్యాక్రాంతం నుంచి కాపాడిన విధానం, నిరుపయోగంగా ఉన్న భూములను దాతల సహాయంతో అభివృద్ధి చేసామని చెప్పారు.

విద్యార్థుల ప్లేస్మెంట్స్ ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పనిచేసి, ఫలితాలు సాధించిన విధానం యూనివర్సిటీ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.ఈ సంవత్సరం ఏయూ విద్యార్థులు అత్యధిక వేతనంగా రూ 84.5 లక్షలతో ఉపాధి అవకాశాలను సాధించారన్నారు. ఏయూ పరిశోధన, మౌళిక వసతుల అభివృద్ధికి ఉపయుక్తంగా ఎంఓయూలు చేసుకోవడం జరిగిందన్నారు.

ముఖ్య అతిథి జిఎంఆర్ సంస్థల అధినేత జి.ఎం రావు మాట్లాడుతూ విద్యాభ్యాసం తరువాత ఎటువంటి సమాజంలో మనం జీవిస్తున్నామో తెలుసుకోవాలి. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ మానవ మేధస్సును అధిగమిస్తోంది. ఇటువంటి తరుణంలో ప్రత్యేక నైపుణ్యాలు కలిగి ఉండల్సిన అవసరం ఉంది. 2030 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలుస్తుంది. ప్రపంచంలో ఏ మూలకు వెళ్లినా ఏయూ పూర్వవిద్యార్థులు తమకు తారసపడతారు. విద్యతో పాటు విభిన్న నైపుణ్యాలను సైతం కలిగి ఉంటేనే విజేతలుగా నిలుస్తారు.ఏయూలో విద్యార్థి నాయకుడి స్థాయి నుంచి మౌళిక వసతుల కల్పన రంగంలో ఒక సమర్థవంతమైన వ్యక్తిగా నా ప్రస్థానం సాగింది. నా ప్రయాణంలో అనేక సవాళ్లు ఎదురయ్యాయి,

విజయమార్గం అంత సాఫీగా ఉండదు. తానకు హైదరాబాద్, ఢల్లీ ఎయిర్పోర్ట నిర్మాణంలో ఎదురైన సవాళ్లు, దార్శనికతతో పనిచేసి, విజయం సాధించిన విధానాలను ఉదహరించారు. జి 20కి భారత్ ఆతిధ్యం ఇచ్చింది, విదేశీ అద్యక్షులు భారత్కి వచ్చారు. బలమైన భారత్ దేశాన్ని వీరంతా దర్శిస్తున్నారు. మన తుదిశ్వాస వరకు అభ్యాసనం కొనసాగించాలి. ఆర్టిఫీషియల్ ఇంటిలెజెన్స్ నేడు సమాజాన్ని నడిపిస్తోంది, దీన్ని అందిపుచ్చుకుంటే మనదే పైచేయి అవుతుంది. వినయం లేని చదువు వ్యర్థం. ఆధ్యాత్మికత, యోగ మానవుని మనస్సుని, శరీరాన్ని సమన్వయం చేస్తుంది. రెండేళ్లలో ఏయూ శతాబ్ది మహోత్సవాన్ని జరుపుకోనుంది. దీనిలో మీరంతా భాగం కావాలని కోరుకుంటున్నారు. భవిష్యత్ నాయకులుగా, ఆవిష్కర్తలుగా, మార్పుకు కారకులుగా నిలవాలని కోరుకుంటున్నాను. ఊహించని విజయాలు మీరు సాకారం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.

రాష్ట్ర విద్యశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఏయూ పేరు వింటేనే తెలుగు ప్రజల హృదయాలు పులకిస్తాయన్నారు. ఏయూ అనుబంధ కళాశాల విద్యార్థిగా, విద్యాశాఖ మంత్రిగా కార్యక్రమంలో పాల్గొనడం ఆనందాన్ని ఇస్తోందన్నారు. 1957లో దేశంలోనే తొలి సారిగా ఎంబిఏ కోర్సును ప్రారంభించిన ఘనత ఏయూకి ఉంది. నోబెల్ బహుమతి గ్రహీత సి.వి రామన్ ఏయూలో పరిశోధనలు జరిపారన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డి విద్య రంగానికి వేలకోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నారరన్నారు. విలువైన మానవ వనరులను సృష్టించడం లక్ష్యంగా విద్యకు అత్యధిక ప్రోత్సాహం కల్పిస్తున్నారని చెప్పారు. ప్రాథమిక స్థాయి నుంచి విద్యను బలోపేతం చేస్తున్నామన్నారు.

స్నాతకోత్సవంలో ప్రధానం చేసే బెస్ట్ రీసెర్చర్ అవార్డును ఈ స్నాతకోత్సవంలో నలుగురికి ప్రధానం చేశారు. ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య బి.మోహన్ వెంకట రామ్, ఆచార్య వజీర్ మహ్మద్లకు గవర్నర్ చేతుల మీదుగా ప్రధానం చేశారు.

హాస్టల్ భవనాలు ప్రారంభం....

ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన మూడు నూతన హాస్టల్ భవనాలను రాష్ట్ర గవర్నర్ స్నాతకోత్సవం వేదికపై ప్రారంభించారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులు నిర్మించి, బహూకరించిన సర్ మోక్షగుండం విశ్వేసరయ్య హాస్టల్, అంతర్జాతీయ విద్యార్థులకు నిర్మించిన భారత్ జి 20 ప్రెసిడెన్సీ హాస్టల్, శతాబ్ది క్లాసిక్ హాస్టల్ భవనాల శిలాఫలకాలను ఆవిష్కరించి గవర్నర్ చేతుల మీదుగా హాస్టల్ని ప్రారంభించారు.

స్నాతకోత్సవంలో భాగంగా గవర్నర్ను వర్సిటీ తరపున సత్కరించి, జ్ఞాపికను బహూకరించారు. గవర్నర్ చేతుల మీదుగా ముఖ్య అతిధి జి.ఎం రావును, గౌరవ డాక్టరేట్ గ్రహీతలు కొలకలూరి ఇనాక్, అల్లూరి ఇంద్రకుమార్, విద్యశాఖ మంత్రి బొత్స సత్యనారాయణలను సత్కరించారు.కార్యక్రమంలో ఉన్నత విద్య మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రా రెడ్డి, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ప్రిన్సిపాల్స్, వర్సిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### నారాయణ జపంలోనే ఆత్మానందం

దుర్యోధనుడు ఇలాంటి గుణాలతోనే దుర్మరణం పాలయ్యారని, వారికి అండదండలు కల్పించిన వారు కూడా అదే శిక్షకు పాత్రులయ్యారని అన్నారు. జీవిత సత్యాలు గ్రహించడం అంటే ధర్మసూక్ష్మాన్ని అర్థం చేసుకొని, నిజాయితీగా, ప్రేమగా, పరోపకారంతో జాలి, దయలతో నిత్యజీవితం గడపడమేనని, నారాయణ నామం నిరంతరం అంతర్లీనంగా జపిస్తూ ఆయనకు చేరువ కావాలని అభిభాషించారు.

వ్యక్తులు తమ ఆనందం కోసం మాత్రమే ఆలోచించి తదనుగుణంగా ప్రవర్తిస్తారని, భగవంతుడు తనను ఆరధించేవారి ఆనందాన్నే తన ఆనందంగా భావించి వారిని నిరంతరం రక్షిస్తూ ఉంటారని అన్నారు. అన్నమాచార్య కీర్తనలు గానం చేస్తూ ధర్మ పరాయణుల ఇంట బిక్షను స్వీకరిస్తూ తాను ఆనందకరమైన జీవితాన్ని గడుపుతున్నానని, నాభి నుండి తన శరీరంలో నిరంతరం నారాయణ నామాన్ని జపిస్తూ ఉంటానని అదే తనను ఆనందపారవశ్యంలో ఓలలాడిస్తోందని వారు తెలిపారు. భవబంధాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వకుండా భగవన్ నామ స్మరణకే అంకితమైనవారు ఆయన ప్రేమకు నోచుకోబడతారని సెలవిచ్చారు.

అనంతరం శ్రీమతి అరుణగాయత్రి, శ్రీమాన్ వేంకట సత్యశ్యామ్ దంపతులు వారికి గౌరవ వందనాలతో కూడిన పవిత్ర బిక్షను సమర్పించారు. వచ్చిన భక్తులందరినీ శ్రీమాన్ నారాయణాచార్యులు ఆశీర్వదించారు.

### మేడపాటి రవీంద్రకు ఎంపీ జీవీఎల్ అభినందన

జిల్లా అధ్యక్షునిగా నియమితులైన వారు మేడపాటి రవీంద్ర రెడ్డి ఒక్కరేనని,ఇది ఆయన ప్రత్యేకతను తెలియజేస్తుందని ఎంపీ జీవీఎల్ అన్నారు. ఆయన సారథ్యంలో పార్టీ మరింత అభివృద్ధి చెందుతుంది అని జీవీఎల్ వ్యాఖ్యానించారు.

### డిఆర్ఎం కార్యాలయంలో విజిలెన్స్ వర్క్‌షాప్

లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విజిలెన్స్ అధికారులు పంచుకునే విలువైన సూచనలు, సలహాలు, సలహాలను వినాలని, సబ్జెక్ట్‌పై సందేహాలను నివృత్తి చేయాలని ఆయన పాల్గొనేవారికి సూచించారు.

పి.పి. సిన్హా డిప్యూటీ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, అవినీతి రహిత సంస్థ యొక్క లక్ష్యాన్ని సాధించడానికి ప్రభుత్వ సేవకుల ధోరణులు మరియు అవినీతి చర్యల ప్రయత్నాలను తనిఖీ చేయడానికి సమర్థవంతంగా నివారణ విజిలెన్స్‌పై చర్యలు తీసుకోవాలని ఉద్ఘాటించారు. టెండర్లు, వేలంపాటలు, ఒప్పందాలు, క్రమశిక్షణా చర్యలలో అనుసరించాల్సిన విధానాలు మొదలైన వాటిని ప్రాసెస్ చేసేటప్పుడు ఎటువంటి వ్యత్యాసాలు ఉండకూడదని అతను విస్తృతమైన మరియు జాగ్రత్తగా పాటించాల్సిన చర్యలను ఇచ్చాడు.

ఎ. రామారావు, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ (పర్సనల్), విజిలెన్స్ యొక్క వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ప్రెజెంటేషన్ సమయంలో, విజిలెన్స్ అధికారులు పాల్గొనే వారి అభిప్రాయాన్ని, సూచనలను సేకరించడానికి మరియు ఏవైనా లోపాలు లేదా స్పష్టీకరణలను పరిష్కరించడానికి వారితో సంభాషించారు. పారదర్శకత, జవాబుదారీతనం మరియు నైతిక ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా సెమినార్ నిర్వహించబడింది.

ఈ వర్క్‌షాప్‌లో సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ -II పిజె శర్మ, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ అవటపల్లి అవినాష్ శర్మ, డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ సౌరభ్ ప్రకాష్, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ సంతోష్ కుమార్ మరియు ట్రాఫిక్ కమర్షియల్ అండ్ పర్సనల్ బ్రాంచ్‌ల సిబ్బంది కూడా పాల్గొన్నారు.

సెమినార్ ముగింపులో పాల్గొనేవారికి అనేక కేస్ స్టడీస్ వివరించబడ్డాయి మరియు విజిలెన్స్ ఆర్గనైజేషన్‌ను మరింత ప్రభావవంతంగా చేయడంపై దృష్టి సారించి వారిలో ఆసక్తికరమైన ఓపెన్ ఎండెడ్ ఇంటరాక్టివ్ సెషన్‌ను కూడా నిర్వహించారు.

### శంకర్ ఫౌండేషన్ డీజీఎం బంగార్రాజుకు వైద్యులచే సత్కారం

సత్కరించి వారి నిబద్ధత తో కూడిన పని తీరు పట్ల ప్రశంసల జల్లు కురిపించారు.

బంగార్రాజు పౌరసంబంధాలను పటిష్ఠపరచడములో , లైసన్ కార్యక్రమాలు నిర్వహించడములో ఆసుపత్రికి మంచిపేరు , ప్రఖ్యాతలు సంపాదించారని వారు కొనియాడారు.

### అవినీతి ఆరోపణలతో చంద్రబాబు నాయుడు అరెస్టు

అన్నారు. తాను తప్పు చేస్తే నడిరోడ్డుపై ఉరితీయండి అని చెప్పారు. ఏ చట్టం ప్రకారం నన్ను అరెస్టు చేస్తారో చెప్పాలని నిలదీశారు. ప్రాథమిక ఆధారాలు లేకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు.

తాము హైకోర్టుకు ప్రాథమిక ఆధారాలు ఇచ్చామని పోలీసు అధికారులు పేర్కొన్నారు. ఆధారాలు చూపాలంటూ చంద్రబాబు తరపు న్యాయవాదులు కోరగా రిమాండు రిపోర్టులో అన్ని వివరాలు ఉన్నాయని చెప్పారు. దాదాపు గంటపాటు వాదప్రతివాదాలు జరిగాయి. అవినీతి ఆరోపణలపై అరెస్టు చేస్తున్నట్లు నోటీసులో పోలీసులు పేర్కొన్నారు. మీరు మాతో విజయవాడకు బయలుదేరితే 15 నిమిషాల్లో మీరు కోరిన అన్ని పత్రాలు వాట్సాప్‌లో పంపిస్తామన్నారు. అనంతరం చంద్రబాబుకు వైద్యపరీక్షలు నిర్వహించి ఆయన భద్రతాదళం సమక్షంలోనే విజయవాడకు తీసుకెళ్లారు.

**అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉత్కంఠ**

'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం రాత్రి నంద్యాలలో బహిరంగ సభలో పాల్గొన్నారు. అనంతరం అర్ధరాత్రి 12 గంటల నుంచి శనివారం తెల్లవారే వరకు తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నంద్యాలలో తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు బస చేసిన ఫంక్షన్ హాల్‌ను వందలాదిమంది పోలీసులు చుట్టుముట్టారు. 600 మందికిపైగా పోలీసులు నంద్యాలకు చేరుకున్నారు. పట్టణాన్ని దిగ్బంధించారు. అడుగడుగునా చెక్‌పోస్టులు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. చంద్రబాబు బస చేస్తున్న ఆర్.కె.ఫంక్షన్ హాల్ చుట్టూ ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మోహరించారు. అనంతరం డీఐజీ రఘురామిరెడ్డి, ఎస్పీ రఘువీర్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. అడ్డుగా బైఠాయించిన తెదేపా శ్రేణుల్ని నెట్టుకుంటూ పోలీసులు ఫంక్షన్ హాల్ లోపలికి ప్రవేశించారు. మొదట చంద్రబాబు ముఖ్య భద్రతాధికారితో సంప్రదింపులు జరిపారు. అనంతరం ఆయన నిద్రిస్తున్న బస్సు వద్దకు చేరుకుని నిద్రలేపేందుకు ప్రయత్నిస్తుండగా నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు.

**ఠాణాకు తెదేపా నేతల తరలింపు**

ఆర్.కె.ఫంక్షన్ హాల్ ప్రాంగణం నుంచి తెదేపా కార్యకర్తలు, మీడియా ప్రతినిధులను దూరంగా పంపివేసిన పోలీసులు తర్వాత లోపల ఉన్న వారి వాహనాలనూ తొలగించారు. అనంతరం పోలీసు వాహనాలను లోపలికి తీసుకెళ్లారు. లోపల ఉన్న తెదేపా నాయకులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్లకు తరలించారు. చంద్రబాబు బస్సు వద్ద రక్షణగా ఉన్న భూమా బ్రహ్మానందరెడ్డి, భూమా అఖిలప్రియ, జగత్‌విఖ్యాత్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎ.వి.సుబ్బారెడ్డి తదితరులను మహానంది ఠాణాకు తరలించారు. ఆ ప్రాంగణాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు.

**నేతల ప్రతిఘటన**

రాత్రి 3 గంటల సమయంలో అధికారులు చంద్రబాబును నిద్రలేపేందుకు ప్రయత్నించారు. డీఐజీ రఘురామిరెడ్డి, తెదేపా నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. తెదేపా కర్నూలు జిల్లా అధ్యక్షుడు బి.టి.నాయుడు, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తలుపునకు అడ్డుగా నిల్చుని తీవ్రంగా ప్రతిఘటించారు. పగలంతా కార్యక్రమాల్లో పాల్గొని అలసిపోయిన తమ నేత ప్రస్తుతం విశ్రమిస్తున్నారని చెప్పారు. ఇంత రాత్రి సమయంలో ఆయన్ను ఎందుకు నిద్రలేపేందుకు ప్రయత్నిస్తున్నారని ప్రశ్నించారు. ఇందుకు డీఐజీ స్పందిస్తూ మేం మీతో మాట్లాడటం లేదు. మాజీ ముఖ్యమంత్రి ముఖ్య భద్రతాధికారితో చర్చిస్తున్నాం. మధ్యలో మీరెందుకు జోక్యం చేసుకుంటున్నారన్నారు. తెదేపా అధినేతను జిల్లాకు తానే ఆహ్వానించానని, మీరు ఏదైనా ఉంటే నాతోనే మాట్లాడండని బీటీ నాయుడు చెప్పారు. తాము బస్సులోపల ఏం జరుగుతుందో తెలుసు కోవాలనుకుంటున్నాం. చంద్రబాబుతో మాట్లాడాలని భావిస్తున్నట్లు పోలీసు అధికారులు చెప్పారు. ఇందుకు నాయకులు, తెదేపా కార్యకర్తలు ససేమిరా అన్నారు.

**బస్సునే లాక్కెళతాం..**

చంద్రబాబును నిద్రలేపేందుకు తాము ఒప్పుకోమని తెదేపా నాయకులు స్పష్టం చేశారు. మీరు ఇలా అడ్డుకుంటే బాబు బస చేస్తున్న బస్సునే లాక్కెళతామని పోలీసులు బెదిరించారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి విశ్రమిస్తున్న బస్సును లాక్కెళతామనడం అన్యాయమని కాలవ శ్రీనివాసులు, ఇతర తెదేపా నాయకులు ఖండించారు. మీరు ఏం చర్యలు తీసుకోవాలన్నా, ఏం మాట్లాడాలనుకున్నా ఉదయం రావాలని కోరారు.

విశాఖ సమాచారమ్

ఆదివారం 10-09-2023

# మీ డబ్బు ఎక్కడకు పోతుంది?!

మనసుని కదిలించే కళ్లు చెదిరే నిజం, చదివిన తర్వాత మీరు కూడా ఆశ్చర్యపోతారు... మీ డబ్బు ఎక్కడకు పోతుంది?!

మన భారతదేశంలో మొత్తం 4120 మంది ఎమ్మెల్యేలు మరియు 462 ఎమ్మెల్సీలు అంటే మొత్తం 4,582 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు.

ఒక్కో ఎమ్మెల్యే జీతభత్యంతో కలిపి నెలకు 2 లక్షలు ఖర్చు చేస్తారు.వేరే పదాల్లో నెలకు 91 కోట్ల 64 లక్షల రూపాయలు.

దీని ప్రకారం సంవత్సరానికి సుమారు 1100 కోట్ల రూపాయలన్నమాట.

భారతదేశంలో లోక్‌సభ మరియు రాజ్యసభతో కలిపి మొత్తం 776 మంది ఎంపీలు ఉన్నారు.

ఈ ఎంపీలకు జీతం భత్యంతో కలిపి నెలకు 5 లక్షలు ఇస్తారు.అంటే మొత్తం ఎంపీల జీతం నెలకు 38 కోట్ల 80 లక్షలు.

ఇక ప్రతి సంవత్సరం ఈ ఎంపీలకు జీత భత్యం కింద రూ.465 కోట్ల 60 లక్షలు ఇస్తారు.

అంటే భారతదేశంలోని ఎమ్మెల్యేలు మరియు ఎంపీలు ప్రతి సంవత్సరం 15 వేల కోట్ల 660 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

ఇది వారి ప్రాథమిక వేతనం మరియు భత్యానికి సంబంధించిన విషయం. వారి నివాసం, జీవనం, ఆహారం, ప్రయాణ భత్యం, చికిత్స,విదేశీ విహారయాత్రలు మొదలైన వాటి ఖర్చు కూడా దాదాపు అదే.

అంటే ఈ ఎమ్మెల్యేలు, ఎంపీల కోసం దాదాపు 30 వేలకోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి.

ఇప్పుడు వారి భద్రతలో మోహరించిన భద్రతా సిబ్బంది జీతాన్ని పరిగణించండి.

ఒక ఎమ్మెల్యేకు ఇద్దరు అంగరక్షకులు మరియు ఒక సెక్షన్ హౌస్ గార్డు అంటే కనీసం 5 మంది పోలీసులు, అంటే మొత్తం 7 మంది పోలీసులు భద్రత కల్పిస్తారు.

7 గురు పోలీసుల జీతం సుమారుగా (నెలకు రూ. 35,000 చొప్పున) రూ. 2 లక్షా 45 వేలు.

దీని ప్రకారం 4582 మంది ఎమ్మెల్యేల భద్రతకు వార్షిక వ్యయం ఏడాదికి 9 వేలకోట్ల 62 కోట్ల 22 లక్షలు.

అదే విధంగా ఎంపీల భద్రత కోసం ఏటా 164 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు.

జెడ్ కేటగిరీ భద్రతా నాయకులు, మంత్రులు, ముఖ్యమంత్రులు, ప్రధాన మంత్రి భద్రత కోసం దాదాపు 16000 మంది సిబ్బందిని ప్రత్యేకంగా మోహరించారు.

దీని కోసం మొత్తం వార్షిక వ్యయం రూ.776 కోట్లు ఖర్చు.

ఇలా ప్రతి ఏటా దాదాపు 20 వేలకోట్ల రూపాయలు పాలక నేతల భద్రతకు వెచ్చిస్తున్నారు.

అంటే ఏటా కనీసం 50 వేలకోట్ల రూపాయలు రాజకీయ నాయకుల కోసం ఖర్చు చేస్తున్నారు.

ఈ ఖర్చులలో గవర్నర్ ఖర్చులు, మాజీ నాయకులు, పార్టీ నాయకులు, పార్టీ అధ్యక్షుల పెన్షన్, వారి భద్రత మొదలైనవి ఉండవు.

అది కూడా కలుపుకుంటే మొత్తం ఖర్చు దాదాపు 100 బిలియన్ రూపాయలు అవుతుంది.

ఇప్పుడు ఆలోచించండి. మనం ప్రతి సంవత్సరం రాజకీయ నాయకుల కోసం 100 బిలియన్ రూపాయల కంటే ఎక్కువ ఖర్చు చేస్తున్నాము, పేద ప్రజలకు ప్రతిఫలంగా ఏమి లభిస్తుంది?

(ఈ 100 బిలియన్ రూపాయలను మన భారతీయుల నుండి మాత్రమే పన్నుగా వసూలు చేయబడుతుంది.)

ఇక్కడ కూడా సర్జికల్ స్ట్రైక్ జరిగింది. భారతదేశంలో రెండు చట్టాలు చేయాలి.

**మొదటిది** : ఎన్నికల ప్రచారంపై నిషేధం నాయకులు టెలివిజన్ ద్వారా మాత్రమే ప్రచారం చేయాలి, ప్రచార ఖర్చు ఒకరికి 10 వేలు మాత్రమే.

**రెండవది:-** నాయకుల జీతాలు, ఉచితాలు, సబ్సిడీలు మరియు అలవెన్సులపై నిషేధం విధించాలి

అప్పుడు కనబడుతుంది రాజకీయ నాయకుల్లో సేవ చేసే గుణం, దేశభక్తి ఎవరికి ఎంతుందో ప్రతి భారతీయుడు ఈ రాజకీయ నాయకుల అనవసర, అంతు లేని ఖర్చు, వ్యయానికి వ్యతిరేకంగా మాట్లాడాలి.

**ది విశాఖ మహిళా పరస్పర సహాయ సహకార సంఘము లిమిటెడ్**
Regd.No. AMC/VSP/DCO/2000/458.
**ఫోన్. నం. 0891-2704555, 2720755.**

సర్వసభ్య సమావేశం నోటీసు

మన సహకార సంఘం యొక్క మహాజన సభ తేదీ : 25-09-2023 సోమవారం ఉదయం 10 గంటలకు సంఘ ఆవరణలో జరుపబడును. కావున సభ్యులందరూ మహాజన సభకు హాజరు కావలసినదిగా కోరడమైనది.

చర్చనీయాంశములు

1. తేదీ : 30-09-2022 న జరిగిన సర్వసభ్య సమావేశపు తీర్మానములు.
2. 31-03-2023తో అంతమగు సంవత్సరమునకు పాలక వర్గము వారు సమర్పించిన పరిపాలన నివేదిక.
3. 31-03-2023 సంవత్సరపు ఆడిట్ రిపోర్ట్‌ను ఆమోదించుట గూర్చి.
4. ఆడిట్ రిపోర్ట్‌ను అనుసరించి 2022-23 సంవత్సరములో సంఘము సాధించిన నికర లాభమును బైలా నం. 45 ప్రకారము కేటాయించి మూలధనముపై వచ్చు డివిడెండ్‌ను నిర్ణయించుట గూర్చి.
5. 2023-24 సంవత్సరమునకు ఆడిటర్‌ను నియమించుట గూర్చి.
6. అధ్యక్షులు వారి అనుమతితో ఇతర విషయములు.

**సం.**
**పాలకవర్గం అనుమతితో**

**యలమంచిలి బుల్లి ప్రసూనాంబ**
**అధ్యక్షురాలు**

**విశాఖపట్నం,**
**తేదీ : 02-09-2023**

# మొరాకోలో తీవ్ర భూకంపం

## 820కి పెరిగిన మృతుల సంఖ్య



రబాత్: ఆఫ్రికా దేశమైన మొరాకో ప్రకృతి విపత్తుతో వణికిపోయింది. భూకంప ధాటికి మృతుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఈ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారి సంఖ్య 820కి చేరింది. మరో 672 మంది గాయపడ్డారని మొరాకో ప్రభుత్వం వెల్లడించింది. గాయపడినవారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే భారీ సంఖ్యలో భవనాలు ధ్వంసమయ్యాయి. చారిత్రక నేపథ్యం ఉన్న కట్టడాలు దెబ్బతిన్నాయి.

పర్యాటక ప్రాంతమైన మర్రాకేశ్‌కు నైరుతి దిశగా 71కిలోమీటర్ల దూరంలో శుక్రవారం రాత్రి ఈ భూకంపం సంభవించింది. భూకంప లేఖినిపై తీవ్రత 6.8గా నమోదైందని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే వెల్లడించింది. అల్ హౌజ్, మర్రాకేశ్, క్వార్జాజేట్, అజిలాల్ సహా పలు ప్రాంతాలు ఈ భూకంప ధాటికి వణికిపోయాయి. దాంతో పలు భవనాలు నేలమట్టం అయ్యాయి. 'అకస్మాత్తుగా భూమి కంపించడంతో భవనాలు కదిలిపోయాయి. దాంతో ప్రజలు కేకలు వేసుకుంటూ బయటకు పరుగులు తీశారు. అప్పుడే సరిగ్గా విద్యుత్తు నిలిచిపోయింది. పది నిమిషాల పాటు మేం అంధకారంలో ఉండిపోయాం. ఏ నెట్‌వర్క్ పనిచేయలేదు' అని ప్రత్యక్ష సాక్షి ఒకరు మీడియాకు వెల్లడించారు.

'భూమి కంపిస్తోన్న సమయంలో నేను నిద్రలో ఉన్నాను. నాకు గాల్లోకి ఎగిరిపోయినట్లు అనిపించింది. దాంతో వెంటనే ఇంట్లో నుంచి బయటకుపరిగెత్తాను. నది ఒక్కసారిగా కట్టలు తెంచుకొని ప్రవహించినట్లుగా అనిపించింది. మా ప్రాంతమంతా ఏడుపులు, కేకలతో నిండిపోయింది' అని మర్రాకేశ్ స్థానికులు వాపోయారు. దాంతో ప్రభావిత ప్రాంత ప్రజలంతా రాత్రి ఆరుబయటే ఉండిపోయారు.

ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గాయపడిన వారితో సమీప ఆసుపత్రులు కిక్కిరిసిపోయాయి. దేశం గతంలో ఎన్నడూ ఈస్థాయి భూకంపాన్ని చూడలేదని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ప్రకంపనల ప్రభావం పొరుగున ఉన్న అల్జీరియాలో కనిపించింది. అయితే, అక్కడ ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. 1980లో అల్జీరియాలో 7.3 తీవ్రతతో తీవ్ర భూకంపం సంభవించింది. ఆ దుర్ఘటనలో 2500 మంది మరణించగా.. 3 లక్షల మంది నిరాశ్రయులుగా మారారు. ఈ ఏడాది తుర్కియే ప్రకృతి ప్రకోపానికి గురైన సంగతి తెలిసిందే. దాంతో వేలల్లో మరణాలు సంభవించాయి.

**ప్రధాని మోదీ దిగ్భ్రాంతి..**

మొరాకోలో భూకంపంపై ప్రధాని మోదీ స్పందించారు. ఈ భూకంపం వల్ల వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడంపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులకు సంతాపం తెలిపారు. ఈ క్లిష్ట సమయంలో మొరాకో ప్రభుత్వంతో కలిసిపనిచేయడానికి భారత ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. మొరాకోకు సమష్టిగా సాయం చేయాలని జీ20 ప్రారంభోపన్యాసంలో కూడా మోదీ పిలుపునిచ్చారు.

# సిఎం పర్యటన ఏర్పాట్లను వెంటనే ప్రారంభించండి



**విజయనగరం:** ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది రాకుండా, పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎస్పీ దీపిక తో కలిసి హెలిపాడ్ ప్రాంతాన్ని కలెక్టర్ సందర్శించారు. రెండుమూడు స్థలాల పరిశీలన అనంతరం, జేఎన్టీయూ జంక్షన్ వద్ద నున్న స్థలాన్ని ఖరారు చేశారు. అక్కడ వెంటనే హెలిపాడ్ నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశించారు. జేఎన్టీయూ జంక్షన్ నుంచి ప్రభుత్వ వైద్య కళాశాలకు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న మొక్కలను తొలగించి, గోతులను పూడ్చి, రోడ్డును పటిష్టం చేయాలని ఆదేశించారు. మార్గంలో అక్కడక్కడా ప్రజలు వేచి ఉండేందుకు అనువుగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, రెవెన్యూ, హెల్త్, విద్యుత్, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 15 న ప్రభుత్వ వైద్య కళాశాల ప్రారంభం

## రూ.8,500 కోట్లతో 17 వైద్య కళాశాలలు : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖామంత్రి విడదల రజని



**విజయనగరం:** జిల్లా ప్రజల చిరకాల స్వప్నాన్ని నిజం చేస్తూ, ఈ నెల 15 న విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభిస్తారని, విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ, వైద్యారోగ్య శాఖా మంత్రి విడుదల రజని తెలిపారు. దీంతో పాటుగా రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల, ఏలూరు వైద్య కళాశాలలను కూడా ముఖ్యమంత్రి ఇక్కడి నుంచే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వి.టి.కృష్ణబాబు, ఏపిఎంఎస్ ఐడిసి ఎండి మురళీధర రెడ్డితో కలిసి మంత్రులిద్దరూ శనివారం ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటనా ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ఇతర అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి పాల్గొనే వేదికలపై చర్చించి, పలు సూచనలు చేశారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ, జిల్లా ప్రజలు ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ వైద్య కళాశాల కోసం కలలుగంటున్నారని, దానిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు నిజం చేస్తున్నారని అన్నారు. విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు మరో నాలుగు వైద్య కళాశాలలను కూడా ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఒక్కో వైద్య కళాశాలను సుమారు రూ.500 కోట్ల రూపాయలతో నిర్మించడం జరుగుతోందని మంత్రి తెలిపారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలో సుమారు రూ. 8500 కోట్లతో నిర్మించడానికి సంకల్పించారని చెప్పారు. దీనిలో భాగంగా తొలి విడత నిర్మాణం పూర్తయిన ఐదు వైద్య కళాశాలలను ఈ నెల 15వ తేదీన సీఎం ప్రారంభిస్తారని చెప్పారు. వచ్చే ఏడాది మరో ఐదు వైద్య కళాశాలలు, ఆ మరుసటి ఏడాది మిగిలిన ఏడు వైద్య కళాశాలలను నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని మంత్రి తెలిపారు.

# సైబర్ హైజీన్ అండ్ అవేర్‌నెస్‌పై విశాఖ ఉక్కులో శిక్షణ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ - 2023కి 3-నెలల ప్రచారంలో భాగంగా ముందస్తుగా , సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలపై ((నైపుణ్యం & మౌలిక సదుపాయాలను పెంపొందించడం)పై ట్రైనర్ సెషన్‌లను విశాఖ ఉక్కు కర్మాగారం నిర్వహిస్తోంది.

పై ప్రచారంలో భాగంగా, ఆర్ఐఎన్ఎల్ యొక్క మేనేజ్‌మెంట్ డెవలప్ ప్రోగ్రామ్ సెంటర్‌లో ఆర్ఐఎన్ఎల్ యొక్క విజిలెన్స్ విభాగం ఈరోజు మరో 2 సెషన్‌లను నిర్వహించింది.

సివిసి మార్గదర్శకాల ప్రకారం 1వ సెషన్ "పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్"పై మరియు రెండవ సెషన్ "సైబర్ హైజీన్ అండ్ సెక్యూరిటీ" సెంటర్ ఫర్ హెచ్ఆర్‌డిలో "ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్" అన్న పద్ధతిపై రెండు సెషన్స్ నిర్వహించబడ్డాయి.

శ్రీనివాస్ మల్లాది, ఐఆర్ఎస్ఈ డైరెక్టర్ రైల్వేస్, "పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్" అనే అంశంపై మాస్టర్ ట్రైనర్‌గా వ్యవహరించారు. కాంట్రాక్టు నిర్వహణ, టెండర్ల ఖరారు, కాంట్రాక్ట్‌లకు కట్టుబడి ఉండే వివిధ చట్టాలు, వివిధ అంశాలు, అర్హత ప్రమాణాలను రూపొందించడం, టెండర్ కమిటీ ఏర్పాటు మరియు బాధ్యతలు, కాంట్రాక్టుల అమలులో చేయవలసినవి మరియు చేయకూడని వంటి విషయాలపై శ్రీనివాస్ మల్లాడి డెలిగేట్లకు చక్కటి అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఎన్‌వి స్వామి, సిజిఎం (వర్క్స్) ఐ/సి, ఆర్ఐఎన్ఎల్ మరియు యు శ్రీధర్ సిజిఎం (మెయింటెనెన్స్ & మిల్స్) మాట్లాడుతూ, సెషన్ అత్యంత ఇంటరాక్టివ్‌గా ఉందని, ఆర్ఐఎన్ఎల్ ఎగ్జిక్యూటివ్‌లు దీని ద్వారా పొందిన జ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి చక్కటి కార్యక్రమాలను నిర్వహించినందుకు విజిలెన్సు డిపార్ట్మెంట్ ను అభినందించారు.

కృతార్థ్ ఝులా, సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్, నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ, గాంధీనగర్, గుజరాత్ "సైబర్ హైజీన్ అండ్ సెక్యూరిటీ" అనే అంశంపై మాస్టర్ ట్రైనర్ గా ప్రసంగించారు. సైబర్ పరిశుభ్రత భద్రతకు సంబంధించిన కీలక అంశాల గురించి శ్రీ కృతార్థ్ ఝులా సుదీర్ఘంగా మాట్లాడారు. కృతార్థ్ ఝులా సైబర్ బెదిరింపుల యొక్క పురోగతి, అధునాతనత మరియు సంక్లిష్టత మరియు సంస్థ పనితీరును ప్రభావితం చేసే సమాచారాన్ని రక్షించే మార్గాలపై విపులంగా చర్చించారు.

శ్రీ కెహెచ్ ప్రకాష్, సిజిఎం (మెడికల్), శ్రీ ఎస్ కె శ్రీవాస్తవ, సిజిఎం (ప్రాజెక్ట్స్ & కన్‌స్ట్రక్షన్), విజిలెన్స్, శ్రీ కె వేణు, జిఎం (విజిలెన్స్), శ్రీ వి జి మహీధర్ జిఎం (విజిలెన్స్) శ్రీ టికెఎస్ఆర్ ఠాగూర్, జిఎం (హెచ్ఆర్‌డి), మరియు ఆర్ఐఎన్ఎల్ యొక్క ఇతర విభాగాల సీనియర్ అధికారులు ఈ సెషన్‌లో పాల్గొన్నారు. రెండు సెషన్‌లు చాలా సమాచారంతో కూడుకుని ఈ కార్యక్రమం లో పాల్గొన్నవారిచే ప్రశంసించబడ్డాయి.

**BUREAU OF POLICE RESEARCH & DEVELOPMENT, NEW DELHI**
**&**
**ANDHRA PRADESH PRISONS DEPARTMENT**
*Cordially Invites to the Valediction of*
**8th National Conference of Heads of Prisons of All States/UTs**
**on Prisons & Correctional Services in Amrit Kaal**
**On 12th September 2023 at 12:55pm**
**at Sai Priya Resorts, Visakhapatnam.**
Chief Guest
**His Excellency**
**Sri S. Abdul Nazeer**
Hon'ble Governor of Andhra Pradesh

**Sri Harish Kumar Gupta, I.P.S.,**
Principal Secretary to Government,
Home Department &
Director General of Prisons & Correctional Services (FAC)
Andhra Pradesh

# గ్రీన్ టీతో వచ్చే అనారోగ్య సమస్యలు



గ్రీన్ టీ అంటేనే సహజంగా లభించే ఒక దివ్యమైన ఔషదం అనే పేరు ఉంది. చాలామందిలోనూ ఇలాంటి భావనే ఉంటుంది. కానీ గ్రీన్ టీతో కూడా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయి అనే విషయం తెలిస్తే షాక్ అవుతారు. ఎందుకంటే చాలామందికి గ్రీన్ టీతో వచ్చే లాభాలే తెలుసు కానీ గ్రీన్ టీ కూడా హానీ చేస్తుంది అనే విషయం చాలామందికి తెలియదు. ఏంటీ.. కొలెస్ట్రాల్ కరిగించి, అధిక బరువు తగ్గించి ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే గ్రీన్ టీ తో కూడా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయా అని ఆశ్చర్యపోతున్నారా ? ఔను మీరు చదివింది నిజమే. ఇంతకీ ఆ సైడ్ ఎఫెక్ట్స్ ఏంటివి అనేవి తెలియాలంటే మనం మరిన్ని డీటేల్స్ లోకి వెళ్లాల్సిందే.

చాలామందిలో గ్రీన్ టీ ఆరోగ్యానికి మంచిది అనే భావన ఉంటుంది కనుక దీనిని ఎంత ఎక్కువ తీసుకుంటే ఆరోగ్యానికి అంత మంచిది అనే అపోహ కూడా ఉంటుంది. కానీ వాస్తవానికి గ్రీన్ టీ మోతాదుకు మించి కప్పులకు కప్పులు తాగితే లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉంటాయి. అది ఆరోగ్యానికి మేలు కంటే చేసే చేటే ఎక్కువ.

ఖాళీ కడుపుతో గ్రీన్ టీ తాగితే కొంతమందికి కడుపులో మంట రావడంతో పాటు అది అసిడిటి సమస్యకు దారి తీసే ప్రమాదం లేకపోలేదు. గ్రీన్ టీలో ఉండే కంటెంట్స్ శరీరంలో ఐరన్, క్యాల్షియం వంటి ఇతర పోషకాలను గ్రహించడంలో అడ్డుపడతాయి. ఫలితంగా ఎముకలు బలహీనపడే ప్రమాదం లేకపోలేదు.

గ్రీన్ టీని ఎక్కువగా తీసుకోవడం వల్ల అది శరీరంలో ఐరన్ సంగ్రహించే ప్రక్రియను అడ్డుకుంటుంది. ఇది క్రమక్రమంగా ఐరన్ లోపానికి దారి తీస్తుంది. గ్రీన్ టీలోనూ కెఫైన్ ఉంటుంది. రోజులో ఎక్కువసార్లు గ్రీన్ టీ సేవించడం వల్ల శరీరంలో కెఫైన్ కంటెంట్ ఎక్కువై అది తలనొప్పికి దారితీస్తుంది.

గ్రీన్ టీని అధిక మోతాదులో సేవించడం వల్ల నిద్రలేమి సమస్యకు దారితీస్తుంది అని హెల్త్ కేర్ ఎక్స్‌పర్ట్స్ చెబుతున్నారు. గ్రీన్ టీని అధిక మొత్తంలో తీసుకోవడం వల్ల శరీరంలో అధిక మొత్తంలో చేరే కెఫైన్ మీ మెదడుకు రక్తం సరఫరా కాకుండా అడ్డుకుంటుంది. ఫలితంగా మోషన్ సిక్‌నెస్ అనే అనారోగ్య సమస్య తలెత్తుతుంది.

గ్రీన్ టీలో టానిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది ఎక్కువ మొత్తంలో తీసుకుంటే.. కళ్లు తిరగడం లేదా వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. గ్రీన్ టీని ఎక్కువగా సేవిస్తే.. అది మీ కాలేయంపై దుష్ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. గ్రీన్ టీ అధికంగా సేవించే వారిలో లివర్ సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది.

# రోజ్ వాటర్ తో మీ ముఖాన్ని మెరిపించండిలా..!



రోజ్ వాటర్ గురించి అందరికీ తెలుసు. ప్రత్యేకంగా పరిచయాలు అవసరం లేదు. బ్యూటీని పెంచే ప్రొడక్ట్స్ లో ఇది కూడా ఒకటి. ఫేస్ ని సాఫ్ట్ గా, మురికి లేకుండా చేస్తుంది. రోజ్ వాటర్ తో చర్మ సౌందర్యం పెంచుకోవచ్చని అందరికీ తెలుసు కానీ.. దీన్ని వాడాలో.. ఎలా వాడితో మంచి రిజల్ట్స్ ఉంటాయో చాలా మందికి తెలీవు. రోజ్ వాటర్ ని కూడా రోజూ వాడొచ్చు. దీంతో ఎలాంటి నష్టాలు, సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అయితే కొన్ని కెమికల్స్ కలిపిన రోజ్ వాటర్స్ కూడా మార్కెట్లో దొరుకుతాయి. ఈ విషయంలో మాత్రం చాలా జాగ్రత్తలు వహించాలి.

రోజ్ వాటర్ ని డైలీ వాడితే మీ ముఖం ఫ్రెష్ గా, క్లీన్ గా, నీట్ గా ఉంటుంది. ఇన్ ఫెక్షన్స్ రాకుండా దూరమవుతాయి. వృద్ధాప్య లక్షణాలు దూరమవుతాయి. చర్మం కూడా హైడ్రేట్ అవుతుంది. రోజ్ వాటర్ ని కేవలం ముఖానికి మాత్రమే కాదు. ఫేస్ కి కూడా వాడొచ్చు. ముడతలు రాకుండా, చర్మం పొడిబారకుండా ఉంటుంది.

**చర్మాన్ని యవ్వనంగా చేస్తుంది:** రోజ్ వాటర్.. చర్మాన్ని యంగ్ గా చేయడంలో బాగా వర్క్ చేస్తుంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి.. కాబట్టి స్కిన్ ని ఫ్రీ రాడికల్స్ నుండి కాపాడుతుంది. అలాగే కొల్లాజెన్ ను ఉత్పత్తి చేస్తుంది. మచ్చలు, ముడతలు తగ్గి స్కిన్ టోన్ మారుతుంది.

**ఎలా వాడితే బెనిఫిట్:** రోజ్ వాటర్ ని టోనర్ లాగా వాడవచ్చు. అలాగే మేకప్ రిమూవర్ గా యూజ్ చేయవచ్చు. రోజ్ వాటర్ తో మేకప్ ఈజీగా వచ్చేస్తుంది. స్కిన్ కూడా మాయిశ్చరైజ్ గా ఉంటుంది. గులాబీ నీళ్లను తరచూ క్రమం తప్పకుండా వాడితే ఇన్ ఫెక్షన్స్ రాకుండా చేస్తుంది.

**రోజ్ వాటర్ నకిలీదని ఎలా గుర్తించాలి:** రోజ్ వాటర్ లో కూడా చాలా నకిలీవి తయారవుతున్నాయి. వీటిని చూడగానే కనిపెట్టవచ్చు. రంగు, వాసన కాస్తా వేరేలా ఉంటాయి. రోజ్ వాటర్ ఫ్లేవర్ స్మెల్ లో కాకుండా.. సెంట్ స్మెల్ లో వస్తే ఇది నకిలీదని ఈజీగా గుర్తించవచ్చు. అలాగే నకిలీ రోజ్ వాటర్ యూజ్ చేయగానే.. స్కిన్ పై దురద వస్తుంది. స్వచమైన రోజ్ వాటర్ ఎప్పుడూ దురద, అలర్జీ సమస్యల్ని కలిగించదు.

# డయాబెటీస్ ని తరిమేసే పౌడర్ ఇదే.. ప్రేగులను కూడా శుభ్ర పరుస్తుంది!



ప్రస్తుతం ఇప్పుడు అందర్నీ వేధించే సమస్య డయాబెటీస్. మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానం కారణంగా.. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ దీని బారిన పడుతున్నారు. చిన్న వయసులోనే మధు మేహం సమస్యతో ఎంతో మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేలకు వేలు ఖర్చు పెట్టి మరీ ట్రీట్మెంట్లు తీసుకుంటున్నారు. ట్రీట్మెంట్ తీసుకుని.. ఎంత కంట్రోల్ లో ఉన్నా కూడా రోజు రోజుకూ ఈ వ్యాధి తీవ్రతరం అవుతూనే ఉంటుంది. దీంతో నచ్చిన ఆహారం తినలేక.. నోరు కట్టుకోవాల్సి వస్తుంది. ఇప్పటికే డయాబెటీస్ ను కంట్రోల్ లోకి తీసుకొచ్చే ఎన్నో రకాల ఫుడ్స్ గురించి, డ్రింక్స్ గురించి తెలుసుకున్నాం. ఇప్పుడు మొత్తానికి డయాబెటీస్ ను తరిమేసే మంచి దివ్యౌషధం గురించి తెలుసుకోబోతున్నాం.

స్టీవియా ఆకులు.. చాలా మందికి వీటి గురించి తెలీవు. ఈ ఆకులు తియ్యగా ఉంటాయి. ఈ ఆకుల పొడి మనకు ఎక్కడైనా లభిస్తుంది. మధుమేహం ఉన్న వారు చక్కెరకు బదులుగా దీన్ని వాడుకోవచ్చు. అలాగే డయాబెటీస్ ను కొద్ది రోజుల్లోనే కంట్రోల్ లోకి తీసుకొస్తుంది. క్రమం తప్పకుండా ఈ ఆకుల పొడిని వాడితే.. షుగర్ ను పూర్తిగా నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు. డయా బెటీస్ ఉన్న వారికి ఇది బెస్ట్ అని చెప్పవచ్చు. ఎందుకంటే తీపి తినలేమని బాధ పడుతూ ఉంటారు. అలాంటి వారు ఈ పొడిని ఉపయోగించి స్వీట్లు కూడా తయారు చేసుకోవచ్చు.

పంచదార, బెల్లం వంటి వాటికి బదులు ఈ స్టీవియా ఆకుల పొడిని వాడుకోవచ్చు. టీ, కాఫీ, జ్యూస్ లు, టిఫిన్స్ లోకి, లస్సీ, వేడి వేడి పదార్థాల్లోకి ఇలా ఈ ఆకుల పొడిని తీసుకోవచ్చు. స్టీవియా ఆకుల్లో క్యాలరీలు, ప్రోటీన్, ఫైబర్, ఫ్యాట్ వంటి పోషకాలు ఉండవు. కాబట్టి ఈ ఆకులను హ్యాపీగా జీర్ణం అవుతుంది. ఇంకా ఈ పొడితో మరి కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి.

ఈ పొడిని వాడటం వల్ల షుగర్ మాత్రమే కాకుండా.. ఆస్తమా, శ్లేష్మాలు, దగ్గు, పిల్లికూతలు వంటి వాటిని కూడా తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. బ్లడ్ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ల బారిన పడకుండా ఉండొచ్చు. రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది.

# జీడిపప్పుని అలా అస్సలు తినొద్దు..



స్వీట్స్‌లో ఎక్కువగా వాడే జీడిపప్పు ఎక్కువగా తింటారు. అదే విధంగా. జీడిపప్పుతోనే చాలా కాజు కత్లీ కూడా చేస్తారు. అదే విధంగా, చాలా కాజు బిర్యానీ, కాజు పన్నీర్ వంటి ఎన్నో వంటలు చేస్తారు.అయితే, దీనిని ఎలా తినాలి. ఎప్పుడు తినాలి. ఎంత మోతాదులో తినాలో తెలియకపోతే చాలా సమస్యలు వస్తాయి. అవేంటో పూర్తి వివరాలు తెలుసుకోండి.

**జీడిపప్పు..** జీడిపప్పులో రిచ్ ఫైబర్ ఉంటుంది. అదే విధంగా, గుండెకి మేలు చేసే ఫ్యాట్స్, కాపర్, మెగ్నీషియం, మాంగనీస్ వంటి పోషకాలు ఉంటాయి. ఇవి బ్రెయిన్ హెల్త్‌ని మెరుగ్గా చేయడమే కాకుండా, ఇమ్యూనిటీని పెంచి బోన్ హెల్త్‌ని కాపాడుతుంది.

**ఫ్రై చేయడం..** సాధారణంగా ఫ్రై చేయడం అన్ హెల్దీ అంటారు కానీ, వీటిని ఇలా ఫ్రై చేసే అందులో ట్యాక్సిన్స్ దూరమవుతాయి. కాల్చినవి జీడిపప్పు మంచివే. వాటిని అలానే తినాలి. అయితే, వీటిని నీటిలో నానబెట్టి కూడా తినొచ్చు. అప్పుడే ఆ పోషకాలు అందుతాయి.

**ట్యాక్సిన్స్ కూడా..** అదే విధంగా పెంకుతో ఉన్న జీడిపప్పులని కాల్చి లేదా ఎండబెట్టి జీడిపప్పులని తీసుకొస్తారు. దీనిని కాల్చినప్పుడు టాక్సిన్స్ కూడా దూరమవుతాయి. అందుకే వీటిని ఇలా ప్రాసెస్ చేయడం మంచిది. ప్రాసెస్ చేసిన జీడిపప్పులు మంచివి.

**అలర్జీ..** అన్ని ఫుడ్స్ అందరికీ పడవు. కొంతమందికి అలర్జీ సమస్యలు వస్తాయి. అదే విధంగా వాపు, ఎన్నో సమస్యలు వస్తాయి. ముఖ్యంగా, నట్ అలర్జీ ఉన్న వారు పచ్చి జీడిపప్పులు తింటే ఫుడ్ అలర్జీ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, కొన్ని తినగానే ఏమైనా సమస్యలొస్తే వాటిని తినడం ఆపేయడం మంచిదని చెబుతున్నారు నిపుణులు. అదే విధంగా వీటిని ఎక్కువగా తీసుకోవడం కూడా మంచిది కాదు.

**అలా ఫ్రై చేయొద్దు...** అయితే, చాలా మంది జీడిపప్పులు ప్రాసెస్ అయ్యాక వాటిని నూనెలో వేసి కారం, ఉప్పు చల్లి మసాలా కాజులా తింటారు. ఇలా ఫ్రై చేసే ప్రాసెస్‌లో అందులోని పోషకాలన్నీ దూరమవుతాయి. కాబట్టి, అలా అస్సలు చేయొద్దొని గుర్తుపెట్టుకోండి. అదే విధంగా, మంచివి కదా అని ఎక్కువగా తినకపోవడమే ఆరోగ్యకరమని గుర్తుపెట్టుకోండి.

# పళ్లు ఎందుకు పుచ్చిపోతాయి?



చాలా మందికి పళ్లు పుచ్చిపోతుంటాయి. మరి కొందరికి చిగుళ్లు ఎపుడూ వాచిపోతూ ఉంటాయి. సరైన ఆహారం తినకపోవడమే ఈ లక్షణాలకు కారణమని వైద్యులతో పాటు పౌష్టికాహార నిపుణులు చెబుతుంటారు. పళ్లు, చిగుళ్లు ఆరోగ్యంగా ఉంటాలంటే ఎలాంటి ఆహారం తినాలో వారు చూసిస్తున్నారు.

కూరగాయలు, పళ్లలో ఫైబర్ ఉంటుంది. ఇది పళ్లపై ఉన్న బ్యాక్టీరియాను, పాచిని తొలగించటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఉదాహరణకు యాపిల్స్‌లో ఉండే మాలిక్ యాసిడ్ - పళ్లపై పొరను శుభ్రం చేస్తుంది. అంతేకాకుండా వీటిలో ఉండే విటమిన్లు.. ఇతర పోషక పదార్థాలు పళ్లను, చిగుళ్లను బలోపేతం చేస్తాయి.

పాలు, పెరుగు, చీజ్ వంటి పదార్థాల్లో కాల్షియం, పోస్ఫరస్‌లు ఎక్కువగా ఉంటాయి. ఇవి బలమైన పళ్లకు, చిగుళ్లకు మేలు చేస్తాయి. చేపల్లో ఓమెగా ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి. ఇవి చిగుళ్ల అనారోగ్యం బారిన పడకుండా కాపాడుతూ ఉంటాయి.

డ్రై ఫ్రూట్స్‌లో ఫైబర్, విటమిన్స్, మినరల్స్ ఉంటాయి. వీటిలో ఉండే పాడుకుండా ఉపయోగిస్తాయి. అంతేకాకుండా ఇవి పళ్లపై బ్యాక్టీరియా చేరకుండా కాపాడతాయి. ప్రతి రోజు ఆహారం తిన్న తర్వాత కొన్ని పదార్థాలు నోటిలో ఉండిపోతాయి. వీటిని వెంటనే శుభ్రం చేసుకోపోతే రకరకాల సమస్యలు ఏర్పడతాయి. దీనితో పాటుగా తరచూ నీటిని తాగుతూ ఉంటే నోటిలో లాలాజలం ఎక్కువగా ఊరుతుంది. ఇవి నోటిని శుభ్రం చేయటంలో కీలక పాత్ర పోషిస్తుంది.

చూయింగ్ గమ్స్‌ను తినటం వల్ల కూడా లాలాజలం ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అయితే చ్యూయింగ్ గమ్‌లో చక్కెర ఉంటుంది. అందువల్ల సుగర్ ఫ్రీ చ్యూయింగ్ గమ్‌ను తినటం మంచిదని అభిప్రాయపడుతున్నారు.

# పరగడపున ఈ నీటిని తాగితే బరువు తగ్గడమే కాదు.. మరెన్నో లాభాలు



సోంపు, యాలకులు.. ఇవి రెండు కూడా వేర్వేరుగా ప్రత్యేక గుణాలు కలిగి ఉన్నాయి. సాధారణంగా ఫుడ్ తిన్నాక చాలా మంది వీటిని తీసుకుంటారు. దీని వల్ల జీర్ణ సమస్యలతో పాటు నోటి దుర్వాసన కూడా దూరమవుతుంది. అయితే, వీటిని వాడడం వల్ల మరిన్ని సమస్యలు కూడా దూరమవుతాయట. అవేంటో తెలుసుకోండి.

**సోంపులోని పోషకాలు..**

అదే విధంగా, సోంపులో ఫైబర్, ప్రోటీన్, కార్బోహైడ్రేట్స్, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్‌లు ఉంటాయి. ఇవన్నీ కూడా శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. రెగ్యులర్‌గా వీటిని తీసుకోవడం మంచిది.

**యాలకుల్లోని గుణాలు..** యాలకుల్లో పొటాషియం, కాల్షియం, మెగ్నీషియంలు ఉంటాయి. వీటితో పాటు విటమిన్స్, రైబోఫ్లేవిన్, నియాసిన్, విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అందుకే వీటిని ఎన్నో ఔషధాల తయారీలోని వాడుతున్నారు .

**జీర్ణక్రియ..** ఈ టీ తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగ్గా మారుతుంది. దీనిని తీసుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు దూరమవుతాయి. ఇందులోని ఫైబర్ జీర్ణక్రియని మెరుగ్గా చేస్తుంది. ఈ టీని తాగితే పేగు కదలికలు మెరుగవుతాయి. ఈ టీని రోజూ ఉదయం పరగడపున తాగితే మలబద్ధకం, అసిడిటీ, అజీర్ణం సమస్యలు తగ్గుతాయి.

**పీరియడ్స్ ప్రాబ్లమ్స్..** కొంతమంది మహిళల్లో ఇరెగ్యులర్ పీరియడ్స్ సమస్య ఉంటుంది. అలాంటి వారు ఈ యాలకులు, సోంపుతో తయారైన టీని తీసుకుంటే ఆ సమస్య చాలా వరకూ దూరమవతుంది. ఇందులోని విటమిన్లు, ఐరన్, పొటాషియం వంటి పోషకాలు సమస్యని తగ్గిస్తాయి. అంతేనా, పీరియడ్స్ టైమ్‌లో వచ్చే నొప్పులు కూడా దూరమవుతాయి.

**వాపు..** సోంపు, యాలకుల టీ తాగడం వల్ల శరీరంలో వాపు సమస్య తగ్గుతుంది. ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. దీంతో బాడీలోని ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. ఈ టీని రోజూ ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగడం వల్ల ఆర్థరైటిస్, కీళ్ళ నొప్పులు, వాపు వంటి సమస్యలు దూరమవుతాయి.

**సోంపు, యాలకుల టీ..** అయితే, ఈ రెండింటితో కలిపి టీ తయారు చేయొచ్చు. ఈ టీని ఖాళీ కడుపుతో తాగడం వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది. ఈ టీలో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ కూడా ఇమ్యూనిటీని పెంచుతాయి. సీజనల్, ఇన్ఫెక్షన్ల కారణంగా వచ్చే సమస్యల్ని ఈ టీ దూరం చేస్తుంది.

**బరువు తగ్గడం..** ఎంతో మంది బరువు తగ్గాలని ట్రై చేస్తుంటారు. అలాంటి వారు ఉదయాన్నే ఈ టీని తాగితే అందులోని ఫైబర్, ఆక్సిడెంట్స్, బాడీలోని అదనపు కొవ్వుని తగ్గిస్తాయి. దీనిని రెగ్యులర్‌గా తాగితే జీవక్రియ పెరిగి బరువు కంట్రోల్‌లో ఉంటుంది.

# నల్ల యాలకులు తెలుసా..

యాలకులు అనగానే సాధారణంగా లేత ఆకు పచ్చ రంగులో ఉండే చిన్న యాలకుల గురించే చాలా మందికి తెలుసు. కానీ, ఇందులో పెద్ద యాల కులు ఉంటాయి. ఇవి కాస్త నలుపు రంగులో ఉంటాయి. వీటిని తీసుకుంటే చాలా సమస్యలు దూరమవుతాయి. ఇందులో యాంటీ ఆక్సిడెంట్ ఎలిమెంట్స్, యాంటీ బ్యాక్టీరియల్, విటమిన్ సి, పొటాషియం, మొదలైన ముఖ్య పోషకాలు ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి చాలా మంచివి.

**కిడ్నీ సమస్యలు..** చాలా మంది అనేక కారణాలతో కిడ్నీ సమస్యలతో బాధపడతారు. అలాంటి వారు రెగ్యులర్‌గా పెద్ద యాలకులని ఆహారంలో చేర్చుకుని తింటే.. ఇవి బాడీ నుండి ట్యాక్సిన్స్ దూరం చేయడమే కాకుండా మూత్ర విసర్జనకి సంబంధించిన సమస్యల్ని కూడా దూరం చేస్తుంది.

**నోటి బ్యాక్టీరియా..** ఈ పెద్ద యాలకులు తీసుకుంటే యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల నోటిలోని బ్యాక్టీరియా దూరమవుతుంది. చిగుళ్ళ ఇన్ఫెక్షన్, దంతాల ఇన్ఫెక్షన్ దూరమవుతుంది. నోటి దుర్వాసన తగ్గించడంలో కూడా చాలా బాగా పనిచేస్తుంది.

**కడుపు సంబంధిత సమస్యలు..** పెద్ద యాలకులని తీసుకోవడం వల్ల కడుపు సంబంధిత సమస్యలు కూడా దూరమవుతాయి. చాలా మందికి ఆకలి ఉండదు. అలాంటి సమస్యని దూరం చేయడంలో యాలకులు హెల్ప్ చేస్తాయి. ఈ యాలకులు తీసుకోవడం వల్ల కడుపులో గ్యాస్, అసిడిటీ వంటి సమస్యల్ని దూరం చేస్తాయి. వీటిని తీసుకోవాలంటే పెద్ద యాలకులు తీసుకుంటే కడుపు ఉబ్బరం వంటి సమస్యలు దూరమవుతాయి.



**రక్తప్రసరణ..** పెద్ద యాలకుల్లో విటమిన్ సి, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మ, రక్త ప్రసరణని మెరుగ్గా చేస్తాయి. ఇవి చర్మాన్ని అందంగా మార్చి మెరిసేలా చేస్తుంది.

**గుండె ఆరోగ్యం..** పెద్ద యాలకుల్లో యాంటీ ఆక్సిడెంట్ ఎంజైమ్స్ ఉంటాయి. ఇవి గుండె పనితీరుని మెరుగ్గా చేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. గుండె కండరాల కణజాలంపై బాగా పనిచేస్తాయి. వీటిని తీసుకోవడం వల్ల గుండె సమస్యలు చాలా వరకూ తగ్గుతాయి.

# ఆహారంలో పెరుగును ఎందుకు తినాలంటే?



చాలా మందికి పెరుగు అంటే ఏమాత్రం ఇష్టం ఉండదు. అనేక మంది దీన్ని ఆరగించేందుకు ఇష్టపడరు. అయితే, పెరుగు వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఈ విషయాన్ని అనేక మంది న్యూట్రిషన్లతో పాటు వైద్యులు కూడా చెప్పారు. అసలు ఆహారంలో పెరుగు తీసుకోవడం వల్ల కలిగే లాభ నష్టాలు ఏంటో పరిశీలిద్దాం.

పెరుగులో మన జీర్ణ వ్యవస్థను మెరుగుపరిచే మంచి బ్యాక్టీరియా ఉంటుంది. ఈ బ్యాక్టీరియా కడుపులోని యాసిడ్ స్థాయిలను నియంత్రిస్తూ ఉంటుంది. అందువల్ల ఆహారం తిన్న పెరుగు తినమంటారు. లేదా మజ్జిగ తాగమంటారు. కొందరికి కడుపునెప్పి తరచు వస్తూ ఉంటుంది. విరోచనాలు కూడా అవుతూ ఉంటాయి. దీనికి బిలోఫిలియా అనే బ్యాక్టీరియా కారణం. ఈ బ్యాక్టీరియాను ఎదుర్కోవటంలో పెరుగు చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

పెరుగులో కాల్షియం, ఫాస్పరిన్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పెరుగులో కొవ్వు ఎక్కువ ఉంటుందని దీని వల్ల గుండెకు ఇబ్బంది కలుగుతుందని కొందరు భావిస్తారు. కానీ పెరుగు మంచి కొలస్ట్రాల్‌ను పెంపొందించటంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. దీనివల్ల గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువ ఉంటుంది. పెరుగులో ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది. అందు వల్ల దీనిని తింటే శరీరంలో బ్లడ్ సుగర్ విలువలు తగ్గుతాయి. మధుమేహ వ్యాధిగ్రస్తులు కూడా దీనిని తినవచ్చు.

## పరవాడలో తెలుగుదేశం పార్టీ నిరసన



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా మండల కేంద్రమైన పరవాడలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు అరెస్ట్ కి సంఘీభావం తెలుపుతూ శనివారం సినిమా హాల్ జంక్షన్ లో నిరసన తెలియజేశారు. అర్ధరాత్రి అక్రమంగా ఎటువంటి ఆధారాలు లేకుండా జాతీయ నాయకుడు మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేయడంపై అన్యాయమని , ఇదేమి రాజ్యం దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేశారు.

## జగన్మోహన్ రెడ్డి నీ పతనం ప్రారంభం అయింది... మాజీ మంత్రి బండారు



**పరవాడ, (విశాఖ సమాచారమ్):** మాజీ మంత్రి టిడిపి నేత బండారు సత్యనారాయణమూర్తి ని వెన్నెలపాలెం తన స్వగృహమునందు. శనివారం హౌస్ అరెస్ట్ చేసిన పరవాడ పోలీసులు. చంద్రబాబు నాయుడు అరెస్టు కారణంగా ఎటువంటి అవాంఛనీయ. సంఘటనలు,. ధర్నాలు జరగకుండా ముందుగానే బండారును అదుపులోకి తీసుకున్న పోలీసులు. ఈ సందర్భంగా బండారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి జడ్ క్యాటగిరి అయినా చంద్రబాబు నాయుడుని అరెస్టు చేయడం అన్యాయమని, జగన్మోహన రెడ్డి నీ పతనం ప్రారంభం అయిందని హెచ్చరించారు. కర్మ కొద్దీ ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రివి అయ్యావు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల దౌర్భాగ్యం అని అన్నారు. ఏ కారణం లేకుండా, ఎటువంటి ఆధారాలు లేకుండా అక్రమంగా జాతీయ నాయకుడు చంద్రబాబును అరెస్టు చేయడం అన్యాయమని , ప్రజలు ఊరుకోరని అన్నారు. 6 నెలల తర్వాత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వటం ఖాయం తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అన్నారు. దొంగ చాటుగా అర్ధరాత్రి అరెస్టు చేయడం అన్యాయమని, ఇలాంటి ముఖ్యమంత్రి కి కేంద్రం. మద్దతు తెలపటం. సరైనది కాదని. బండారు అన్నారు.

## అక్షర జ్ఞానమందించే అపరబ్రహ్మ గురువు



**విజయనగరం, (విశాఖ సమాచారమ్):** అక్షర జ్ఞానమంచిందే అపరబ్రహ్మ గురువు అని ప్రముఖ ఆధ్యాత్మిక గురువు ఉపద్రష్ట వరప్రసాద్, సుపథ రూపకర్త యువిఎన్ రాజు పేర్కొన్నారు. తెలుగుభాషా పరిరక్షణ సమితి, కుసుమంచి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన గురుపూజా దినోత్సవంలో పాల్గొని మాట్లాడుతూ గురుదేవులు జ్ఞానమనే దివ్వెను వెలిగించి ఆ వెలుగులో మన వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించి సరికొత్త జీవితాన్ని అందిస్తారని అన్నారు. సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడంటే అభినయవేత్తగావడం, సృజనశీలికావడం, అత్యంత వ్యామోహంతో తన వృత్తిపట్ల అంకితం కావడమని, శిష్యులలోంచి శిష్యులలోకి జ్ఞానమై ప్రవహిస్తూనే ఉంటాడని అన్నారు. కార్యక్రమాన్ని కంచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు రాజేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. అనంతరం ఉత్తరాంధ్ర నుండి 52 మంది ప్రధాన ఉపాధ్యాయులకు, ఆరుగులు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఫౌండేషన్ అధ్యక్షులు సుబ్బారావు, సమితి అధ్యక్ష కార్యదర్శులు గురుప్రసాద్, జక్కురామకృష్ణలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తెలుగు భాష యొక్క పరిరక్షణ, భాషయొక్కవైభవం కోసం పలువురు వక్తలు ప్రసంగించారు.

# 55 కోట్లతో త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం

**సింహాచలం, (విశాఖ సమాచారమ్):** కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ప్రసాద్ పథకంతో సింహగిరికి మహర్దశ పట్టనుంది .ఈ పథకం కింద సుమారు 55 కోట్లుతో సింహాచలం దేవస్థానంలో భక్తులు సౌకర్యార్థము పలు అభివృద్ధి పనులు త్వరలోనే చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ అదనపు కమిషనర్ కె.రామచంద్ర మోహన్ సింహాచలం ఈవో వి.త్రినాధరావు, దేవాదాయ శాఖ పర్యాటకశాఖ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఈఈలు, శ్రీనివాస్ రాజు రాంబాబు ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీను బాబు, దినేశ్ రాజ్, సంపంగి శ్రీను దొడ్డి రమణ,ఇతర విభాగాల ఉన్నతాధికారులు సింహాచలంలోని పలు ప్రాంతాలలో పూర్తి స్థాయలో పరిశీలించారు. ఏ ఏ ప్రాంతాలను భక్తులకు ఉపయోగ పడే విధముగా ఏ రీతిని అభివృద్ధి చేయాలనేది నిర్ణయించారు. కొండ దిగువన ఉన్న పురాతనమైన పుష్కరణి సత్రము తొలగించి ఆ స్థానంలో జి ప్లస్ ఫైవ్ కింద నూతన సదుపాయాలతో సత్రాలను నిర్మించినున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ సత్యనారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పుష్కరణి సత్రంనిర్మించి సుమారు నాలుగు దశాబ్దాలు దాటింది అన్నారు. ప్రస్తుతం ఆ స్థానంలో. రెండువైపులా జి ప్లస్ ఫైవ్ కింద సత్రాలు నిర్మించి భక్తులకు అందుబాటులోకి



తీసుకొస్తామన్నారు. అయితే మధ్యలో ఉన్న కళ్యాణ మండపం యధాతధంగా ఉంటుందన్నారు. 1936లో నిర్మించిన ఆగమ పాఠశాలను కూడా వేరే ప్రాంతంలో నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలను ఆధునీకరించి ఇతర అవసరాలకువినియోగించుకుంటామన్నారు. దేవస్థానం ఈవో కార్యాలయం కూడా నూతనంగా నిర్మించుకోవాల్సి ఉందన్నారు. టిటిడి సత్రం తో పాటు అనేక ప్రాంతాలను పరిశీలించామన్నారు. రెండో టోల్గేట్ వద్ద సువిశాలమైన పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తామన్నారు... ఇందుకు అవసరమైన స్థలము పర్యాటక శాఖ కు కేటాఇస్తామన్నారు..

**అధునాతన క్యూ కాంప్లెక్స్:** కొండపైన భక్తుల సౌకర్యార్థం అధునాతనమైన క్యూ కాంప్లెక్స్ లు నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న యాగశాల స్థానంలో సువిశాలంగా మరో యాగశాలను నిర్మించనున్నట్లు వివరించారు. ఇందుకోసం స్థానాచార్యులు డాక్టర్ రాజగోపాల్ ప్రధాన అర్చకులు శ్రీనివాసచార్యులు రమణాచార్యులు తదితర వైదిక వర్గాలనుంచి కూడా సలహాలు తీసుకున్నామన్నారు. వారి సూచనల మేరకే ఆలయంలో ఈశాన్యం మూలన యాగశాలను నిర్మించనున్నట్లు కమిషనర్ వివరించారు. ఐతే మాస్టర్ ప్లాన్ కు తగ్గట్లుగానే ఆయా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. త్వరలోనే ఈ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తామన్నారు. అనంతరం కమిషనర్ సింహాద్రినాధుడు ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో కూడా పాల్గొన్నారు. సింహగిరి పైన మ్యూజియమును సందర్శించారు. అంతకు ముందు ఆగమ పాటశాల విద్యార్థుల తో కమిషనర్ ముచ్చటించారు.. వారికి కల్పిస్తున్న సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు.

**దర్మకర్తల మండలి సత్కారం:** ఈ సందర్భంగా అప్పన్న ధర్మకర్తల మండలి సభ్యులు గంట్ల శ్రీను బాబు, దినేశ్ రాజ్, సంపంగి శ్రీను వాసరావు, దొడ్డి రమణలు కమిషనర్ ను ఘనంగా సత్కరించారు. సింహాద్రినాథుడు ఆలయం నమూనా జ్ఞాపిక బహుకరించారు. దేవస్థానము లో అభివృద్ధి పనులకు తమవంతు సహకారం అందిస్తామన్నారు.

## హెచ్.ఐ.వి/ఎయిడ్స్ పైఅవగాహనా సదస్సు యువజన ఉత్సవం - జిల్లా స్థాయి మారథాన్



**విజయనగరం:** భారత ప్రభుత్వము - జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమము యువతలో హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన కల్పించేందుకు యువజన ఉత్సవ కార్యక్రమములను నిర్వహిస్తున్నది దానిలో బాగంగా జూనియర్ మరియు డిగ్రీ చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు జిల్లా స్థాయిలో రెడ్ రన్- మారథాన్ ఈ రోజు ఉదయం 7 గంటలకు విజ్జీ క్రీడా ప్రాంగణం వద్ద డా. సూర్యనారణ, జిల్లా ఎయిడ్స్, లెప్రసి & క్షయ అధికారి (ఇన్-చార్జ, చేతుల మీదుగా 5k red run ప్రారంబించదమైనది. రెడ్ రన్ మారథాన్ ప్రారంభానికి ముందు ఎన్.సాక్షి గోపాలరావు, జిల్లా పర్యవేక్షకుడు, ఈ మార్థాన్ యొక్క ప్రాముఖ్యత చెప్పారు ఈ రెడ్ రన్ మారథాన్ పోటీలలో ప్రధమ స్థానంలో పి సాయి, విద్యార్థి, రూ. 10000 ద్వితీయ స్థానంలో ఎస్. అశోక్, రూ. 7000, గెలుచుకున్నారు వీరితో పాటు మరో ఏడుగురు విధియార్థులకు కూడా 1000 రూపాయల నగదు బహుమతి గెలుచుకున్నారు. ఈ మారథాన్ లో గెలుపొందిన పది మంది విధియార్థులను జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతుందని అన్నారు. ఇందులో జి చంద్రశేఖర్ ఎన్ఎస్ఎస్ పీఓ విజ్జీ స్టేడియం కోచ్లు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నారు.

# డబ్బు సంపాదనకు భార్యాభర్తల వెరైటీ ప్లాన్

డబ్బు సంపాదనకు కొందరు సక్రమమైన మార్గాలను ఎంచుకుంటే.. మరికొందరు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుంటారు. మరికొందరు మరో అడుగు ముందుకేసి మనుషుల బలహీనతను తమ పెట్టుబడిగా మార్చుకునేందుకు ఎంతకైనా తెగిస్తుంటారు. ఇలాంటి వ్యక్తుల గురించి రోజూ వింటూనే ఉంటాం. తాజాగా, మధ్యప్రదేశ్లో ఇలాంటి కేసు ఒకటి వెలుగులోకి వచ్చింది. డబ్బు సంపాదనకు ఓ జంట వెరైటీ ప్లాన్ వేసింది. చివరకు పోలీసులు వారి ఇంటి బెడ్రూంలోని కరెంట్ బల్బ్ హోల్డర్ను విప్పి చూశారు. అందులోని దృశ్యాలను చూసి అంతా షాక్ అయ్యారు. ఇంతకీ అసలు ఏం జరిగిందంటే..

మధ్యప్రదేశ్ గుణ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. నగరానికి చెందిన దేవేంద్ర జదౌన్ అనే వ్యక్తి.. డబ్బు సంపాదన కోసం తన భార్యతో కలిసి వినూత్న ప్లాన్ వేశాడు. తాజాగా, దీపక్ జైన్ అనే వస్త్ర వ్యాపారి ఫిర్యాదుతో ఈ దంపతుల నేరాల చిట్టా వెలుగులోకి వచ్చింది. దేవేంద్ర జదౌన్ భార్య కొన్ని నెలల క్రితం వస్త్ర వ్యాపారికి సోషల్ మీడియా ద్వారా పరిచయమైంది. తరచూ చాటింగ్ చేస్తూ అతడికి బాగా దగ్గరైంది. ఈ క్రమంలో



ఓ రోజు తనకు అర్జంట్ అవసరం ఉందంటూ రూ.5,500లు అప్పుగా తీసుకుంది. వడ్డీతో కలిపి మొత్తం చెల్లిస్తా అని చెప్పడంతో వస్త్ర వ్యాపారి కూడా నమ్మాడు. ఈ క్రమంలో డబ్బు తిరిగి ఇస్తా అని చెప్పి వ్యాపారిని ఆగస్టు 5న తన ఇంటికి పిలిచింది. ఇంటికి వచ్చిన అతడికి టీలో మత్తుమందు కలిపి ఇచ్చింది. అతడు అపస్మారక స్థితిలోకి వెళ్లాక.. దుస్తులు తీసేసి అసభ్యకరంగా వీడియోలు చిత్రీకరించారు. తర్వాత ఆగస్టు 22న ఈ వీడియోలను సదరు వ్యాపారికి పంపించారు. వెంటనే రూ.3లక్షలు ఇవ్వకపోతే వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేస్తామంటూ బెదిరించారు. వారు అడిగిన డబ్బులు ఇచ్చాక కూడా.. మరింత కావాలంటూ బెదిరిస్తుండడంతో బాధితుడు చివరకు పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణను వేగవంతం చేశారు. పోలీసుల విచారణలో సంచలన వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. సదరు దంపతులు కొందరు ముఠా సభ్యులతో కలిసి ఇలాంటి దందాకు పాల్పడుతున్నట్లు తేలింది. వారి బెడ్రూంలో బల్బు హోల్డర్లో కెమెరాను అమర్చి, తద్వారా అశ్లీల వీడియోలను తీసేశారని తెలిసింది. ఆ వీడియోలను చూపించి బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ ముఠా వెనుక స్థానిక ప్రాంతానికి చెందిన ఓ బీజేపీ నాయకడికి హస్తం ఉన్నట్లు కూడా పోలీసులు అనుమానిస్తున్నారు.

## చంద్రబాబు అరెస్ట్కు టిడిపి నిరసన



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** తప్పుడు కేసులు బనాయించి ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో తెలపకుండానే తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు గారిని సిఐడి పోలీసులు అరెస్ట్ కు నిరసనగా తెలుగుదేశం శ్రేణులు అరకులో రోడ్డెక్కాయి. ప్రధాన రహదారిపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా రోడ్డుపై బైఠాయించిన పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు తో సహా తెలుగుదేశం పార్టీ శ్రేణులు నీరస కుమారి, బూర్జా లక్ష్మీ, పాడి చందు, ఇచ్చావతి, బొరిబొరి లక్ష్మి, దామోదర్, సోమరాజు, లక్ష్మణరావు, ప్రసాద్, రాము తదితరులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసు బాబు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఈరోజు చీకటి రోజుగా అభివర్ణించారు. విధ్వంస పాలనకు నిలువెత్తు సాక్ష్యం చంద్రబాబు అరెస్టేనని దాసు బాబు పేర్కొన్నారు. ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో తెలియ జేయకుండా దుర్మార్గంగా చంద్రబాబు గారిని అరెస్ట్ చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసే తప్పిదాలను ప్రజలకు తెలియజేస్తున్నందుకు ఆ గొంతును నొక్కాలని చంద్రబాబు ని అరెస్ట్ చేశారని ఆయన విమర్శించారు. రాత్రి నుంచి నంద్యాలలో చంద్రబాబు క్యాంప్ వద్ద భారీ ఎత్తున పోలీసుల మోహరించి రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ టీడీపీ శ్రేణులను గృహ నిర్బంధాలు చేసి ఇంత దుర్మార్గంగా అరెస్టు చేయడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఎప్పుడూ చూడలేదన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన ఓ మహా నాయకుడిని ఎందుకు అరెస్ట్ చేస్తున్నారో తెలియజేయకుండా ఇలాంటి దుర్మార్గపు పనికి దిగడం భారతదేశ చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. ప్రతిపక్షం లేకుండా చేయడమే జగన్మోహన్ రెడ్డి ప్రధాన లక్ష్యమని అందుకే ఎవరు గొంతు ఎత్తితే వారిని అరెస్టులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. చంద్రబాబు ఉదయించే చంద్రుడని అరిచేత్తో అడ్డం పెట్టి ఆపాలనుకోవడం సాధ్యం కాదని ఆ నిజాన్ని జగన్మోహన్ రెడ్డి గారు తెలుసుకోవాలని దాసు బాబు పేర్కొన్నారు.

## రైళ్ల రద్దు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్లో భద్రతా పనుల కారణంగా ఈ క్రింది రైళ్లు రద్దు చేయబడ్డాయి

1. 11.09.2023 నుండి 17.09.2023 వరకు రాజమండ్రి నుండి బయలుదేరే రైలు నెం. 07466 రాజమండ్రి-విశాఖపట్నం ప్యాసింజర్ రద్దు చేయబడుతుంది.
2. రైలు నెం. 07467 విశాఖపట్నం-రాజమండ్రి ప్యాసింజర్ స్పెషల్ 11.09.2023 నుండి 17.09.2023 వరకు విశాఖపట్నం నుండి బయలుదేరుతుంది.
3. రైలు నెం. 17239 గుంటూరు-విశాఖపట్నం సింహాద్రి ఎక్స్ప్రెస్ 11.09.2023 నుండి 17.09.2023 వరకు గుంటూరు నుండి బయలుదేరుతుంది.
4. 12.09.2023 నుండి 18.09.2023 వరకు విశాఖపట్నం నుండి బయలుదేరే రైలు నం. 17240 విశాఖపట్నం-గుంటూరు సింహాద్రి ఎక్స్ప్రెస్ రద్దు చేయబడుతుంది.
5. 11.09.2023, 12.09.2023, 13.09.2023, 15.09.2023 & 16.09.2023 తేదీల్లో విశాఖపట్నం-విజయవాడ ఉదయ్ ఎక్స్ప్రెస్ నం. 22701 విశాఖపట్నం నుండి బయలుదేరే రైలు రద్దు చేయబడుతుంది.
6. 11.09.2023, 12.09.2023, 13.09.2023, 15.09.2023 & 16.09.2023 తేదీలలో విజయవాడ-విశాఖపట్నం ఉదయ్ ఎక్స్ప్రెస్ నంబర్ 22702 విజయవాడ నుండి బయలుదేరుతుంది.

**తిరువణ్ణామలై స్టేషన్లో ప్రయోగాత్మక స్టాపేజ్**

ప్రజల డిమాండ్ను దృష్టిలో ఉంచుకుని, దిగువ వివరించిన విధంగా తిరువణ్ణామలై స్టేషన్లో ప్రయోగాత్మకంగా కింది ఎక్స్ప్రెస్కు స్టాప్లను అందించాలని రైల్వే నిర్ణయించింది.

1. రైలు నంబర్ 12867 హౌరా-పుదుచ్చేరి సూపర్-ఫాస్ట్ ఎక్స్ప్రెస్ తిరువణ్ణామలై స్టేషన్లో 05.13 గంటలకు ఆగుతుంది మరియు 17.09.2023 నుండి అమలులోకి వచ్చేలా 05:15 గంటలకు బయలుదేరుతుంది.
2. తిరుగు దిశలో రైలు నెం. 12868 పుదుచ్చేరి- హౌరా సూపర్-ఫాస్ట్ ఎక్స్ప్రెస్ తిరువణ్ణామలై స్టేషన్లో 15.56 గంటలకు ఆగుతుంది మరియు 20.09.2023 నుండి అమలులోకి వచ్చేలా 15:58 గంటలకు బయలుదేరుతుంది.

ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని అభ్యర్థించారు.

## బెజవాడ కనకదుర్గమ్మకు పసుపు కుంకుమలు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టణంలో గవరపాలెం శతకం పట్టు శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం ఆధ్వర్యంలో వచ్చే నెల15వ తేదీ న దేవీ నవరాత్రులు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా ప్రతీ సంవత్సరంవలే ఈ సంవత్సరం కూడా ముందుగా బెజవాడ కనకదుర్గమ్మ అమ్మవారికి శనివారం పసుపు,కుంకుమలు ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, పి వెంకట అప్పారావు, సూరిశెట్టి నర్సింగరావు, సమర్పించడం జరిగింది.

## చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ దేశం నేతలు నిరసన



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అర్ధరాత్రి సమయంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్లో శనివారం నల్ల బ్యాడ్జీలు ధరించి చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ నేతలు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అక్కడున్న మీడియా వారితో రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు మాదంశెట్టి నీలబాబు మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్యానికి చీకటి రోజు అని ఎంతో బాధ్యత కలిగిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని అర్ధరాత్రి సమయంలో నేరస్తులను అరెస్టు చేసినట్టుగా అరెస్టు చేయడం ఇది ఆటవిక చర్య అని అన్నారు.. పార్లమెంట్ కార్యాలయం కార్యదర్శి బొలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఒక లెజెండ్ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, 40 ఏళ్లకు పైగా రాజకీయ అనుభవం ఉన్నటువంటి వ్యక్తి చట్టాలను గౌరవించే వ్యక్తి రాష్ట్ర ప్రజలే కాకుండా దేశ ప్రజలు గర్వించే వ్యక్తి అటువంటి వ్యక్తిని అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ అధికార ప్రతినిధి కడిమిశెట్టి నరసింగరావు పట్టణ ఉపాధ్యక్షులు కుప్పిలి జగన్మోహన్రావు ఎన్టీఆర్ అభిమాన సంఘ గౌరవ అధ్యక్షులు పొలిమేర నాయుడు, దూలం ప్రసాదు విల్లూరి రమణబాబు, కోమర్తి నారాయణరావు, గొంప మహేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంగ్రెసు పార్టీలోకి చేరిన 20 కుటుంబాలు

**అరకులోయ, (విశాఖ సమాచారమ్):** శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకురాలు శాంతకుమారి ఆదివాసుల కోసం. ఆదివాసి హక్కులు చట్టాలు కోసం పటిష్టంగా అమలు చేయడానికి గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరాటం చేస్తున్నందుకు ఆకర్షితులై అరకు వ్యాలీ మండలము చిన్నలబుడు పంచాయతీ పక్కన కుడి గ్రామ నికి చెందిన స్వాబి గురుమూర్తి వైసిపి పార్టీ వార్డు మెంబర్ మరియు మాజీ వార్డు మెంబర్ స్వాబి రామ్మూర్తి తో పాటు 20 కుటుంబాలకు శుక్రవారం రాత్రి 7 గంటలకు కాంగ్రెస్ పార్టీలో సాదరంగా స్వాగతం పలికి కాంగ్రెస్ పార్టీలో చేర్పించిన ఏపీ ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర చైర్ పర్సన్ మరియు అరకు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి శ్రీమతి పాచి పెంట శాంతకుమారి ఈ సందర్భంగా కేంద్రంలో రాష్ట్రంలో బిజెపి వైసిపి పార్టీలు కలిసి నిత్యవసర సరుకులు ధరలు భారీగా పెంచింది. మణిపూర్ రాష్ట్రంలో ఆదివాసి. మహిళలపై జరిగిన దాడి చాలా దుర్మార్గమని. దేశంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే గిరిజన హక్కులు చట్టాలు పటిష్టంగా అమలు జరుగుతుంది బిజెపి పార్టీతో జత కలిపిన వైసిపి. టిడిపి. జనసేన. పార్టీలతో ఆదివాసుల హక్కులు చట్టాలకు ఆదివాసులకు భారీ నష్టం జరుగుతుంది ఆదివాసులు మేలుకోవాలని వైసిపి పార్టీ వైరస్ నుండి వీడి కాంగ్రెస్ పార్టీకి రావాలని ఆదివాసులకు. శ్రీమతి శాంతకుమారి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీ తెలగంజి సోమేశ్వరరావు మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు శ్రీమతి గొల్లోరి పద్మ మహిళా నాయకురాలు జన్ని బూజిత డుంబురుగూడా మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తడబారికి భీమారావు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని ఆధారాలతో చంద్రబాబుని అరెస్టు చేశారు

### రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 40 ఇయర్స్ ఇండస్ట్రీ.. రాజకీయాల్లో ఎంతో అనుభవజ్ఞుడునని , అవినీతికి ఆమడ దూరంలో ఉంటానని చెప్పుకుని తిరుగుతున్న టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాపం పండింది. ఆయన అవినీతి డొంక కదిలింది.. ఇక ఆయన శేష జీవితం జైలు పాలేనని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. శనివారం సర్క్యూటివ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు స్కిల్డ్ క్రిమినల్, అన్ స్కిల్డ్ పొలిటీషియన్ అని అక్షరాల రుజువయింది. కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడిన చంద్రబాబు నాయుడుని అరెస్టు చేస్తే, అది తప్పు అంటూ కొంతమంది, కొన్ని మీడియా సంస్థలు ఎందుకు గుండెలు బాదుకుంటున్నాయో అర్థం కావడం లేదని అన్నారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన సిమెన్స్ సంస్థ పేరు వాడుకొని, ప్రభుత్వాన్ని తప్పుతోవ పట్టించి, ఆర్థిక శాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చి 371 కోట్ల రూపాయల ప్రజాధనాన్ని తన షెల్ కంపెనీలకు తరలించుకున్న చంద్రబాబు నాయుడుని అరెస్టు చేయక, తీసుకెళ్లి సినిమా థియేటర్లో సినిమాలు చూపిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు, ఫోర్జరీ, కరప్షన్, చీటింగ్ వంటి నేరాలకు పాల్పడినట్లు ప్రాథమిక సాక్ష్యాధారాలు లభించడం వల్లే ఆయనపై పది నుంచి 12 కేసులు పెట్టారని మంత్రి అమర్నాథ్ పేర్కొన్నారు. పోలీసుల అరెస్టు చేసినప్పుడు కూడా చంద్రబాబు నాయుడు తానేమి తప్పు చేయలేదని చెప్పలేదే! తేలు కుట్టిన దొంగలాగా వ్యవహరించాడని ఆయన అన్నారు. చంద్రబాబు నాయుడు తన క్రిమినల్ స్కిల్స్ ఉపయోగించి ప్రజాధనాన్ని ఏ విధంగా దోచుకున్నాడో, అసెంబ్లీ సాక్షిగా తాము చాలా కాలం కిందటే వివరించామని అమర్నాథ్ చెప్పారు. న్యూరో లాటరీ పేరుతోసాధారణ ప్రజలను మోసం చేస్తున్న విధంగా చంద్రబాబు నాయుడు 371 కోట్ల రూపాయలను దోచేశాడని అమర్నాథ్ చెప్పారు. 2014లో ఆయన అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే ఈ కుంభకోణానికి తెర తీసి 2015 ఫిబ్రవరిలోనే 371 కోట్ల రూపాయలు తన సెల్ కంపెనీలకు బదలాయించుకున్నారని అమర్నాథ్ వివరించారు. ఈ కుంభకోణం పాత్రధారులను ఇప్పటికే ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్టు చేశారని, అనంతరం వారు సేకరించిన వివరాలు ఆధారంగా పాత్రధారి చంద్రబాబు నాయుడును అరెస్టు చేశారని అమర్నాథ్ తెలియజేశారు.

చంద్రబాబు నాయుడు పై కక్ష సాధించాలన్న ఉద్దేశం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి లేదని, ఆయన తప్పు చేశాడు కాబట్టే అరెస్టు చేయాల్సి వచ్చిందని అమర్నాథ్ స్పష్టం చేశారు. 118 కోట్ల మరొక స్కామ్ లో చంద్రబాబు నాయుడు పిఏ శ్రీనివాస్, తదితరుల వాంగ్మూలాలను ఆధారంగా చేసుకుని ఇన్కమ్ టాక్స్ అధికారులు 46 పేజీల ఛార్జిషీట్ తయారుచేసి, చంద్రబాబుపై చర్యలు తీసుకుంటున్నారని అమర్నాథ్ అంటూ, బాబు స్కాం భాగవతం పూర్తిగా తెలియక, ఆయన అనుచరులు, ఆయనకు వత్తాసు పలికే ఎల్లో మీడియా ప్రభుత్వాన్ని తప్పుపట్టడం సరికాదని అన్నారు. దర్యాప్తు సంస్థలు ఈ కేసులను ముందుకు తీసుకెళుతున్న నేపథ్యంలో వారికి భాగంగా ఇచ్చిన వారిని చంద్రబాబు ఎందుకు దేశం దాటించాడని అమర్నాథ్ ప్రశ్నించారు. ఈ కేసులలో చంద్రబాబుకు 10 సంవత్సరాల జైలు సీటు తప్పదని అమర్నాథ్ చెప్పారు. గతంలో ఓటుకు నోటు కేసులో అడ్డంగా జరిగిపోయిన చంద్రబాబు ఇక్కడికి పారిపోయి వచ్చాడని, ఇప్పుడు ఆర్థిక నేరాల కేసులలో ఇరుక్కుపోయాడని ఆయన అన్నారు.

ఆర్థిక నేరాలకు, కుంభకోణాలకు పాల్పడిన చంద్రబాబు నాయుడు అరెస్ట్ చేయటం అన్యాయం అంటూ బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి అనడాన్ని చూస్తే ఆమె లా ను పక్కనపెట్టి, బ్రదర్ కోసం పని చేస్తున్నట్టు కనిపిస్తోందని మంత్రి అమర్నాథ్ ఎద్దేవా చేశారు. పవన్ కళ్యాణ్, సిపిఐ సిపిఎం నేతలు, సెల్ఫ్ సర్టిఫైడ్ మేధావులు ఎల్లో మీడియా బాబు చేసిన నేరాలపై సమాధానం చెప్పకుండా, ప్రభుత్వాన్ని తప్పు పట్టడం, విమర్శించడం వరకు సమంజసమని అమర్నాథ్ ప్రశ్నించారు. పాత్రధారులు ఎంతమంది ఉన్నా, సూత్రధారి దోచుకున్న డబ్బు తిరిగి ప్రభుత్వానికి చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని అమర్నాథ్ వెల్లడించాడు. దయచేసి ఈ వ్యవహారాన్ని ఎవరు రాజకీయ కోణంలో చూడవద్దని అమర్నాథ్ విజ్ఞప్తి చేశారు.

# చంద్రబాబు నాయుడు అరెస్టు జగన్ రెడ్డి కుట్ర బుద్ధ నాగ జగదీష్

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ను నంద్యాలలో సిఐడి అధికారులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రజాస్వామ్యాన్ని జగన్ రెడ్డి హత్య చేశారని ఈరోజు చీకటి రోజుగా భావించవలసి ఉంటుందని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు వైసీపీ ప్రభుత్వం పై ఘాటుగా విమర్శలు చేశారు. నీతికి నిజాయితీకి ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో నిలువుటద్దంగా నిలుస్తూ 14 సంవత్సరాల ముఖ్యమంత్రిగా మరో 14 సంవత్సరాలు ప్రతిపక్ష నాయకుడిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నిరంతరం శ్రమించి రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారని లక్షలాదిమంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు ఉపాధి అవకాశాలు కల్పించిన ఇటువంటి దార్శినికుడునీ అన్యాయంగా అరెస్టు చేయడం జగన్ రెడ్డి కక్షపూరితంగా, కుట్రలో భాగమేనని,ఇది ముమ్మాటికి రాజకీయ కుట్రలో భాగమేనని నాగ జగదీష్ అన్నారు. జగన్ రెడ్డి 16 మాసాలు చంచల్ గూడ జైల్లో చిప్పకూడు తిన్నందున, ఆ చిప్పకూడు మలినాన్ని, అంటించాలని నాలుగున్నర సంవత్సరాలుగా అనేక కుట్రలు చేస్తూ తెలుగుదేశం పార్టీ శ్రేణులను రోడ్డు మీదకు రాకుండా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్నారనే కక్షతో అక్రమ కేసులు పెట్టి బెదిరించి భయపెంచి అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధం చేయడం పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినప్పటికీ తెలుగుదేశం పార్టీ శ్రేణులు చంద్రబాబు అరెస్టుపై నిరసనలు తెలియజేయడానికి రోడ్డు మీదకు వచ్చిన పార్టీ నాయకులు కార్యకర్తలకు జిల్లా తెలుగుదేశం పార్టీ పక్షాన ప్రత్యేకమైన అభినందనలు తెలియజేస్తున్నామని నిరంతరం వైసిపి ప్రభుత్వంపై ఇదేవిధంగా పోరాడి చంద్రబాబు నాయుడు ను ముఖ్యమంత్రి చేయడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని నాగ జగదీష్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సిఐడి అధికారులు కూడా కొంతమంది రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అధికారులు కులాభిమానంతో జగన్ రెడ్డి ఆదేశాల ప్రకారం సకల శాఖామంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి కనుసన్నులలో సిఐడి పనిచేస్తున్నది తప్ప రాజ్యాంగ విలువలు కాపాడడంలో, గాని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో గాని, ఎటువంటి సూత్రబద్ధత లేదని నాగ జగదీష్ మండిపడ్డారు. అదే విధంగా ఈరోజు ఉదయం నాతోపాటు అనకాపల్లి జిల్లాలో తెలుగుదేశం శ్రేణులను మహిళలను అరెస్టు చేయడం గృహ నిర్బంధం



చేయడం నన్ను పోలీస జీప్ లో ఎక్కించి అనకాపల్లి పోలీస్ స్టేషన్ కు తీసుకు వెళ్లకుండా, రకరకాలు గ్రామాలు తిప్పి, అలనాడు బ్రిటిష్ పోలీస్ విధానాన్ని అనుసరించి బుచ్చియ్యపేట పోలీస్ స్టేషన్ కు తరలించడంపై పోలీసులపై నాగ జగదీష్ తీవ్రంగా మండిపడ్డారు. కేవలం జగన్ రెడ్డి కళ్ళల్లో ఆనందం చూడడం కోసం చంద్రబాబు నాయుడును ఎలాగైనా అరెస్టు చేయాలని తలంపుతో విదేశీ పర్యటనకు వెళ్లి చంద్రబాబు అరెస్టుతో నాకు సంబంధం లేదని సూక్తులు వల్లించి తన ప్రభుత్వంపై వస్తున్న ప్రజా వ్యతిరేకత నుండి ప్రజలను పక్కత్రోవ పట్టించడానికి ఇదొక మార్గంగా ఎంచుకున్నారని నాగ జగదీశ్ వ్యాఖ్యానించారు. మహానేత రాజశేఖర్ రెడ్డి, విజయమ్మ, తప్పుడు కేసులు 27 కేసులు నుండి ఏ తప్పు చేయకుండా నిర్దోషిగా కోర్టులు తీర్పులిచ్చాయని అలాగే జగన్ రెడ్డి పెట్టిన అన్ని కేసులు నుండి కూడా కడిగిన ముత్యంల బయటికి వస్తారని నాగ జగదీష్ ఆశాభావం వ్యక్తపరిచారు.

# చంద్రబాబు అరెస్టు ను నిరసిస్తూ టీడీపీ నాయకులు నిరసన

### ఉద్రిక్తతల మధ్య నిరసనకారులను అరెస్టు చేసిన పోలీసులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** నంద్యాలలో టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ అదేశాలు మేరకు అనకాపల్లి పట్టణంలో నెహ్రూ చౌక్ జంక్షన్ వద్ద శాంతియుతంగా నిరశన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళ్లకు గంతలు కట్టుకొని, నల్ల బ్యాడ్జీలు ధరించి కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు, సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదించారు. ఈ సందర్భంగా నిరసన చేస్తున్న సంఘటన స్థలానికి అనకాపల్లి టౌన్ పోలీసులు చేరుకొని నిరసనకారులను అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ సమయంలో కొద్దిసేపు పోలీసులకు తెలుగుదేశం పార్టీ నాయకులకు మధ్య కుదిరితే పరిస్థితి నెలకొంది.అంతకుముందు స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహం వద్ద నుండీ నిరశనగా పార్టీ శ్రేణులు నెహ్రూ చౌక్ జంక్షన్ కు చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బి ఎస్ ఎం కె జోగీ నాయుడు , కొణతాల శ్రీనివాసరావు,బొద్దపు ప్రసాద్, పోలార పు త్రినాధ్, సిరసపల్లి సన్యాసి రావు, ఆళ్ళ రామచంద్రా రావు,కర్రి బాబీ,విష్ణు చౌదరి,



తలారి కాశీ నాయుడు, సతీశ్ కుమార్,సందిన సునీల్ కుమార్, కర్రి గోపీ, ఎంఎస్ఎన్, పిట్లా రాజు, దాడి జగన్, లక్ష్మీ ప్రసన్న, బత్తుల రమేష్, దొడ్డి రాము, నరసింగ, కరణం పవన్ కుమార్, భాను చంద్ర అఖిల్ తదితరులు పాల్గొన్నారు. మొత్తం 37 మంది తెలుగుదేశం పార్టీ నాయకులను కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసినట్టు తెలిపారు. నెహ్రూ చౌక్ జంక్షన్లో ఎటువంటి అల్లర్లు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# ఏటీఎం చోరీకి భారీ స్కెచ్.. సీన్ రివర్స్..!

ఆభరణాలు, మొబైల్, బైక్, నగదు మొదలైనవి చోరీకి గురైన సంఘటనల గురించి మీరు చాలాసార్లు విని ఉంటారు. చూసి ఉంటారు కూడా. అలాగే, చాలా సందర్భాల్లో ఏటీఎం దొంగతనాల గురించి కూడా వినే ఉంటారు. ఏటీఎం మిషన్లను ధ్వంసం చేసిన దుండగులు నగదు దోచుకెళ్లటం, లేదంటే.. ఏకంగా ఏటీఎం మిషన్నే ఎత్తుకెళ్లిన ఘటనలు కూడా గతంలో వార్తల్లో చూశాం. అలాంటిదే ఇక్కడో ఏటీఎం దోపిడీకి సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇందులో కొంతమంది ముసుగు దొంగలు ఏటీఎం దోచుకోవడానికి ప్లాన్ చేస్తున్నారు. అందుకోసం వారు వేసిన ప్లాన్ గతంలో ఎప్పుడూ వినుండరు. అలాంటి షాకింగ్ కేసు ఒకటి మహారాష్ట్ర నుండి వెలుగులోకి వచ్చింది.

మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో ఏటీఎం చోరీ కేసు వెలుగులోకి వచ్చింది. బీడ్‌లో కొందరు ముసుగు దొంగలు ఏటీఎం మెషీన్‌ను చోరీ చేసేందుకు విఫలయత్నం చేశారు. అయితే నగదుతో పాటు ఏటీఎంను చోరీ చేసినందుకు దొంగలు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ఏటీఎం మిషన్ ఎత్తుకెళ్లేందుకు వారు చేసిన ప్రయత్నం, ఆ తరువాత ఏం జరిగిందో మొత్తం అంతా అక్కడున్న సీసీ కెమెరాలో రికార్డైంది. ప్రస్తుతం ఆ ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారిన ఈ వీడియోలో కొందరు దొంగలు ఏటీఎంను దోచుకునేందుకు ప్లాన్ చేశారు. వారి ప్లాన్ ప్రకారం..ఓ కారుతో ఏటీఎం వద్దకు చేరుకున్నారు. ముందుగా దొంగలు కారుకు తాడు కట్టారు. తాడు మరో కొనను ఏటీఎం సెంటర్లలోని ఏటీఎం మిషన్‌కు తగిలించారు. ఆ తర్వాత కారు స్టార్ట్ చేశారు. అలా కారు వేగంగా స్టార్ట్ చేయటంతో ఏటీఎం మిషన్ మొత్తం ఊడి వచ్చేస్తుందని వారి ప్లాన్ . కానీ, వారి ప్లాన్ బెడిసికొట్టింది. కారుతో ATMను ఎత్తుకెళ్లాలని భావించిన దొంగలకు



తిక్క కుదిరింది. ఏటీఎంను కారు తాడుతో కట్టేసిన దొంగ అక్కడే నిలబడి ఉన్నాడు. కారులో ఉన్న డ్రైవర్‌ని కారు స్టార్ట్ చేయాలని చెబుతాడు.. కారు స్టార్ట్ అవగానే.. ఏటీఎం మిషన్ విరిగిపోయి స్పీడ్‌గా దూసుకొచ్చింది.. ఏటీఎం డోర్ వద్దే నిలబడి ఉన్న వ్యక్తిని బలంగా ఢీకొట్టింది. దాంతో అతడు ఉన్నాడో.. ప్రాణం పోయిందో తెలియదుగానీ, ఒక్కదెబ్బతో అతడునేలను కరుచుకున్నాడు.

ఈ ఘటన సెప్టెంబర్ 6వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిందని తెలిసింది. దోపిడీ దొంగలు పక్కా స్కెచ్‌తో ఏటీఎం చోరీకి వచ్చారు. కానీ,వారి సక్సెస్ కాలేదు. ఏటీఎం విరిగి దొంగపడినంతలోనే ఏటీఎంలో అమర్చిన సెక్యూరిటీ సర్వీస్ ద్వారా దొంగతనం జరిగినట్లు సమాచారం పోలీసులకు చేరింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏటీఎం చోరీకి గురికాకుండా కాపాడారు. కానీ, ముసుగు దొంగలు తప్పించుకున్నట్టుగా తెలిసింది.

# చంద్రబాబు అరెస్టు ప్రజాస్వామికం

### తెలుగుదేశం పార్టీ నాయకుల కార్యకర్తల అరెస్టులు అన్యాయం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నచేస్తున్నతెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలను, మాజీ ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను, దేశం నాయకులను కార్యకర్తలను అరెస్టు చేసి నిర్బం ధించడం అప్రజా పరిపాలనకు నిదర్శనం బీబైరా ఫౌండేషన్ చైర్మన్ బైరా దిలీప్ చక్రవర్తి అన్నారు. అప్రజా స్వామికంగా చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేయడమే కాక.. కనీసం నిరసన తెలిపే అవకాశం కూడా ఇవ్వకుండా అనకాపల్లి జిల్లాలో టీడీపీ నాయకులం దరిని గృహ నిర్బంధం చేయటం దారుణ మని దిలీప్ చక్రవర్తి విమర్శించారు.

ఎలాంటి కారణం లేకుండా.. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా తెలుగు మహిళ అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే వంగల పూడి అనితను గృహ నిర్బంధం చేయ టం ఈ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని బైరా దిలీప్ మండిపడ్డారు. ఒక దళిత మహిళా నాయకురాలిని ఈ విధంగా నిర్బంధించటం ప్రభుత్వ



వైఖరికి నిదర్శనమన్నారు. అక్రమంగా అరెస్లులు చేయడమే కాక.. నిరసనలు కూడా తెలియచేయనివ్వకుండా టీడీపీ నేతలందరిని నిర్బంధం చేయడం .. ప్రతిపక్ష పార్టీ కార్యక్రమాలన్నిటిని అడ్డుకోవడం చూస్తుంటే ఈ రాష్ట్రం ఎలాంటి డిక్టేటర్ పాలనలో నడుస్తుందో అందరికీ అర్థమవుతుందున్నారు. మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్న ఈ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వ వైఖరిని బైరా దిలీప్ తీవ్రంగా ఖండించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం రావడమే, అనేక పోరాటాలతో ఉద్యమాలతో నిరసనలతో స్వతంత్రం వచ్చిందన్న సంగతి జగన్ రెడ్డి గుర్తెగాలని, ఈ అరెస్టులు సైకో పరిపాల నకు నిదర్శనం.కేంద్ర మానవ హక్కుల కమిషన్ కు ఈ విషయంపై కంప్ల యింట్ చేస్తామని ఆయన ప్రకటిం చారు.చరిత్రలో ప్రతి డిక్టేటర్ దారుణ మైన పతనాన్ని చూడాల్సి వచ్చింది .. జగన్మోహన్ రెడ్డికి కూడా అదే గతి పడుతుందని అన్నారు. చంద్రబాబు అరెస్టుతోనే ఈ ప్రభుత్వ పతనం మొదలైందని.. ఇక ఎవరూ ఆపలేరని బైరా దిలీప్ హెచ్చరించారు. ఎన్నికలు దగ్గరకొస్తున్న వేళ తెలుగుదేశం పార్టీ, నేతలు, కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బ తీయాలని చూస్తున్నారు. కాని అందరం కలిసి ఈ ప్రభుత్వంపై పోరాడతామని దిలీప్ ప్రకటించారు.

ప్రభుత్వ దమననీతిని నిరసిస్తూ ప్రజ లు స్వచ్ఛందంగా నిరసనలు తెలియ చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు చేపట్టిన అనిత



విజయనగరం: జిల్లా రెవెన్యూ అధికారిగా ఎస్.డి. అనిత శనివారం కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆమె ఎం.గణపతి రావు స్థానంలో జిల్లా రెవెన్యూ అధికారిగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆమె విశాఖలో ఏ.పి.ఐ.ఐ.సి.లో జోనల్ మేనేజర్ గా చేశారు. గతంలో ఆమె జిల్లాలో పర్యాటక శాఖ అధికారిగా చేశారు. ప్రస్తుత డి.ఆర్.ఓ. ఎం.గణపతి రావు శ్రీకాకుళం జిల్లా రెవెన్యూ అధికారిగా నియమితులయ్యారు. డి.ఆర్.ఓ.గా నియమితులైన అనితకు కలక్టరేట్ ఏ.ఓ. తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లాల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తా






పాడేరు, (విశాఖ సమాచారమ్): జిల్లాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కె. ఎస్. జవహర్ రెడ్డి స్పష్టం చేసారు. అల్లూరి సీతా రామ రాజు జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు జిల్లాలలో ఉన్న సమస్యలను తెలుసుకోవడానికి వచ్చానని పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో జిల్లా కలెక్టర్‌గా సేవలందించానని రంపచోడవరం, భద్రాచలం పి ఓగా సేవలందించడం వలన చింతూరు, కూనవరం, వి. ఆర్.పురం, శ్రీకాకుళం జిల్లా సీతంపేట ప్రాంతాలపై అవగాహన ఉందన్నారు. మాతా శిశు మరణాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని చెప్పారు. రహదారులు, తాగునీటి సమస్యలు, విద్యా సంస్థలకు మౌలిక సదుపాయాలు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. పాడేరు ఉమ్మడి విశాఖ జిల్లాలో ఉన్నప్పుడు కలెక్టర్ రావాలంటే చాల కష్టంగా ఉండేది, కొత్త జిల్లాలు ఏర్పాటు చేసాక జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఎస్పీ స్థానికంగా అందుబాటులో ఉన్నారని చెప్పారు. పార్వతీపురం సీతంపేట ప్రాంతాల కంటే అల్లూరి సీతారామ రాజు జిల్లాలో సేవలందించం ఇబ్బంది కరంగా ఉంటుందాన్నారు.

పాడేరు డివిజన్లో పని చేస్తున్న అధికారులను అభినందించారు. తాగునీటి సదుపాయాలు, రహదారుల నిర్మాణాలకు నిధలు మంజూరు చేస్తామన్నారు. హైరిస్కుర్భవతులను ప్రసవ సమయానికి తరలించాలని చెప్పారు. నెల రోజులు ముందుగా అసుపత్రులకు

అల్లూరి సీతా రామ రాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ రీ సర్వే, అటవీ హక్కుపత్రాలు పంపిణీ, గృహ నిర్మాణాలు, జల్ జీవన మిషన్లో చేపట్టిన తాగునీటి పథకాల నిర్మాణాలు, ఐసిడి ఎస్ సేవలు, వ్యవసాయ, ఉద్యాన వన శాఖలు, కాఫీ తోటలు పెంపకం, మనబడి నాడు నేడులో పాఠశాలలకు మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులు, వైద్య సేవలు, కీటక జనిత వ్యాదుల నివారణ చర్యలు, సికిల్సెల్ ఎనిమియా పరీక్షలు, రహదారుల నిర్మాణాలు ఎస్ సి ఎ ( స్పెషల్ సెంట్రల్ అసిస్టెన్స్) కింద మారుమూల గ్రామాలకు రోడ్ల నిర్మాణాలు, ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాల పురోగతిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ జిల్లాలో ఆపరేషన్ పరివర్తన్ కింద గంజాయి నిర్మూలనకు చేపట్టి చర్యలను వివరించారు. గంజాయి సాగు స్థానంలో రైతులకు ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలు, ఉద్యానవన మొక్కలు పంపిణీ చేసామని చెప్పారు. ముందుగా అల్లూరి సీతా రామరాజు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. సమావేశం అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో సి. ఎస్. మొక్కలు నాటారు. ఆతరువాత వైద్య కళాశాల నిర్మాణపు పనులు పరిశీలించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, పాడేరు ఐటిడి ఏ పి ఓ వి. అభిషేక్ రంప చోడవరం పి ఓ సూరజ్ గనోరే, సీతంపేట పి ఓ కల్పనా కుమారి, పార్వతీపురం పి ఓ సి . విష్ణు చరణ్ రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం బన్సల్, అల్లూరి సీతా రామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాల జిల్లా అధికారు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అక్రమ అరెస్ట్ ను ఆపేయాలంటూ టిడిపి నిరసన





యలమంచిలి, (విశాఖ సమాచారమ్): టీడీపీ జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి, 45సంవత్సరాల రాజకీయ చరిత్ర గల వ్యక్తి, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి నారా చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేయించడం దుర్మార్గపు చర్య అని తెలుగుదేశం పార్టీ మాజీ పార్లమెంటు సభ్యులు,సీనియర్ నాయకులు పప్పల చలపతిరావు అన్నారు.శనివారం నాడు ఆయనతో పాటుగా రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దూళి రంగనాయకులు,రాంబిల్లి మండలాధ్యక్షులు వసంతవాడ దిన్ బాబు, నియోజకవర్గములో గల నాలుగు మండలాలకి సంబంధించి పలువురు టిడిపి నేతలను ముందస్తుగా అరెస్టు చేసి ఆయా పరిధిలలో గల పోలీస్ స్టేషన్లకు తరలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ దేశాలే చంద్రబాబు నాయుడిని ఆదర్శంగా తీసుకుంటుంటే ఆయనపై బురదజల్లే ప్రయత్నంలో ఏదో ఒక చెడ్డపేరు చంద్రబాబు నాయుడుపై తీసుకు రావాలన్న కక్ష సాధింపుతోనే వైసీపీ ప్రభుత్వం ఈ అరెస్ట్ చేయించిందని తెలిపారు. జగన్ ప్రభుత్వం నియంత ధోరణినీకి నిదర్శనం అని మండిపడ్డారు కనీసం ఎఫ్ఐఆర్ లో పేరు లేకున్నా అరెస్ట్ చేయడం పిరికిపంద చర్య అని ప్రభుత్వంపై మండిపడ్డారు.ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ కౌలుకులూరి విజయబాబు,యలమంచిలి పట్టణ,రాంబిల్లి మండల నాయకులు పాల్గొన్నారు.

## "దొంగలలో రాజకీయ దొంగలు వేరయా"

కక్కుర్తి కాటికి చేరే దాకా తీరదు.

ఈ దాహం నేటి రాజకీయ నాయకులలో మరింత ఎక్కువ.

అందరూ మేక వన్నె పులులే.

ఎంతని కూడ బెడతారు. ఆశకు అంతు లేదు.

ప్రజా ధనం దోచుకోవడమే వీరి పరమావధి. అందరి నీతి 'అవినీతి'. ఎవరికి ఎవరూ తీసిపోరు. అవినీతి రహిత పాలనలో పోటీ పడరు. అవినీతి లోనే పోటీ. ఖ్యాతి కోసం అవినీతి.

అక్రమ ఆర్జన, కుంభకోణాలు వీరి నిత్య కృత్యం.

ఒక ఆదిత్య నాథ్ ఒక నరేంద్ర మోడీ వీరికి ఆదర్శం ఏమాత్రం కాదు.

ప్రాంతీయంగా నిలదొక్కుకుని జాతీయంగా వీరి రాజకీయ కార్యకలాపాలను విస్తరించడానికి వెనుకాడరు.

అందుకే కుటుంబ పాలనకు మొగ్గు చూపుతారు.

నోరు తెరిస్తే అబద్ధం. అబద్ధాలతో చెలామనీ.

జీవితం చాలా చిన్నది అన్న పరిజ్ఞానం వీరికి గుర్తుకి రాదు.

విచక్షణ వివేకం క్రమ శిక్షణ ఏ కోశానా కనిపించవు.

ప్రాకులాట, పదవీదాహం అణువు అణువు అవినీతి మయం.

అక్రమ ఆర్జనే వీరి ధ్యేయం. అంతరాత్మలు వీరికుండవు.

వీరు మంచి వీరు చెడు అని చెప్పలేము, నిర్ధారించలేదు.

దొంగలకు 'దురాలోచనే' దూరా లోచన ఉండదు.

అందుకే దొంగలందు దొంగ రాజకీయ నాయకులు వేరయా అంటారు.

డా. నండూరి రామకృష్ణ.

## చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ నిరసన చేస్తున్న దేశం నాయకులను అరెస్టు చేసిన పోలీసులు



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ను నంద్యాల పర్యటనలో ఉన్న సమయం లో అర్ధరాత్రి సిఐడి అధికారులు స్కిల్ డెవలప్మెంట్ కేసులో ఎఫ్ఐఆర్ లో చంద్రబాబు పేరు లేకపోయినా అక్రమ అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయము పార్లమెంట్ కమిటీ సభ్యులు జిల్లా అధ్యక్షులు ముద్దు నాగ జగదీశ్వరరావు ఆదేశాల మేరకు పార్లమెంట్ కార్యాలయం నుండి ఊరేగింపుగా రింగ్ రోడ్డు ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న సందర్భంగా పోలీసులు అరెస్టు చేసి టౌన్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు బోడి వెంకట్రావు మాట్లాడుతూ శాంతి యుతంగా పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ను అక్రమ అరెస్టుకు నిరసనగా చేపట్టిన కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేసి అన్యాయంగా పోలీస్ స్టేషన్ కు తరలించారని జగన్ రెడ్డి ప్రభుత్వం పై నిరంతరం పోరాటం చేస్తామని వైసీపీ ప్రభుత్వం అవినీతి అక్రమాలను వివరిస్తామని ఎన్ని కుట్రలు చేసినా చివరకు న్యాయమే గెలుస్తుందని చంద్రబాబు నిర్దోషిగా బయటకు వస్తారని వెంకటరావు ఆశాభావం వ్యక్తపరిచారు.

పోలీసులు అరెస్టు చేసిన వారిలో బోడి వెంకటరావు మల్ల శివన్నారాయణ అండి బోయిన శేషు దాడి అప్పారావు బుద్ధ భువనేశ్వరరావు తిప్పన అప్పారావు దాడి త్రినాథ్ తిమ్మాపూర్ గంగాధర గుర్రాల వాసు దాడి జగన్నాథరావు పీలా శ్యామ్ నాదముని ఫణీంద పలక వరప్రసాద్ బర్నికాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్ట్ అనైతికం : కసిరెడ్డి ప్రసాద్



యలమంచిలి, (విశాఖ సమాచారమ్): టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ శనివారం నియోజకవర్గములో గల రాంబిల్లి మండల ప్రధాన కేంద్ర మైన రాంబిల్లి ప్రధాన కూడలి, పోలీస్టేషన్ కూడళ్ల వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన చేశారు.సిఎం జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన నశించాలని, చంద్రబాబును వెంటనే విడుదల చేయాలని రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు.సుమారు గంటపాటు టీడీపీ శ్రేణులు నిరసన చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి, న్యాయవాది కసిరెడ్డి ప్రసాద్ మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ కేసుల్లో ఎటువంటి ఆధారాలు లేకుండా, కనీసం నోటీలు ఇవ్వకుండా చంద్రబాబు నాయుడుని ఎలా అరెస్టు చేస్తారని ఆయన ప్రభుత్వాన్ని, పోలీసులను ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యల్లో భాగంగా పోలీసులు, సిఐడీ అధికారులతో చంద్రబాబును అరెస్టు చేయడం అన్యాయమన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రజలకు సుభీక్ష పాలన అందించిన చంద్రబాబుకు ప్రజలు దీవెనలు మెండుగా ఉన్నాయని, కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వం పోలీసులను అడ్డంపెట్టుకొని చేస్తున్న అరాచకాలను ప్రజలు చూస్తున్నారని, తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆరోజులు ఆరోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. అనంతరం పోలీసులు నేతలు ప్రసాద్, మాజీ సర్పంచ్ సత్య నారాయణ, మాజీ ఎంపీసీటీ సభ్యులు దేముడు, పార్టీ మండల ఉపాధ్యక్షులు సూరాడ అప్పలరాజు,గోవింద్, అప్పలరెడ్డి, ఆదిరెడ్డి, శ్రీనివాసరావు, పలువురు నేతలను, కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్టేషన్కు తరలించారు. సుమారు 16 మందిని అరెస్టు చేసి పోలీస్టేషన్ కు తరలించినట్లు ఎస్ఐ దీనబందు తెలిపారు.

## నా బాధ చెప్పుకోవడానికే అమ్మవారి దగ్గరకు వచ్చాను

### చంద్రబాబు అరెస్టుపై నారా భువనేశ్వరి సంచలన వ్యాఖ్యలు



ఏపీలో టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు అరెస్టు రాజకీయంగా దుమారం రేపింది. నంద్యాలలో అర్ధరాత్రి నుంచి జరిగిన హైడ్రామా అనంతరం చంద్రబాబును సీఐడీ అదుపులోకి తీసుకుంది. నంద్యాల ఆర్‌కే ఫంక్షన్ హాల్ దగ్గర బాబును అరెస్టు చేసిన సీఐడీ పోలీసులు.. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో ఆయన్ను ఏ37గా చేర్చారు. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే, ఈ కేసు వివరాలను తనకు ఇవ్వాలని కోరారు చంద్రబాబు. దర్యాప్తు అధికారి లేకుండా తనను ఎలా అరెస్టు చేస్తారని నిలదీశారు చంద్రబాబు. తన హక్కులను పోలీసులు కాలరాస్తున్నారని ఆవేదన చెందారు. FIR నమోదు చేయకుండా నోటీసులు ఇవ్వకుండా అరెస్టు చేయడమేంటని ప్రశ్నించారు. చంద్రబాబు ప్రశ్నలకు క్లారిటీ ఇచ్చారు పోలీసులు. రిమాండ్ రిపోర్టులో అన్ని విషయాలు ఉంటాయని చెప్పారు. ఆధారాలు లేకుండా ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించిన చంద్రబాబుకు..అరెస్టుకు సంబంధించిన పేపర్లను అందజేశారు. నంద్యాలలో అరెస్ట్ చేసిన చంద్రబాబును వైద్య పరీక్షల అనంతరం రోడ్డు మార్గంలో విజయవాడకు తరలించారు. విజయవాడకు తరలించిన అనంతరం సాయంత్రం కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ ప్రక్రియ అంతా సాయంత్రానికి పూర్తి అవుతుందని CID చీఫ్ వెల్లడించారు.

**చంద్రబాబుకు ప్రతిఒక్కరూ మద్దతివ్వాలి**

చంద్రబాబు అరెస్టు అనంతరం ఆయన సతీమణి నారా భువనేశ్వరి కీలక వ్యాఖ్యలు చేశారు. విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గమ్మను దర్శించుకున్న నారా భువనేశ్వరి, ఆమె సోదరుడు రామకృష్ణ.. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారికి వేదపండితులు అశీర్వచనం అందించారు. అనంతరం నారా భువనేశ్వరీ మీడియాతో మాట్లాడారు. బాధలు చెప్పుకోవడానికి దుర్గమ్మను దర్శించాను.. చంద్రబాబును రక్షించాలని కోరుకున్నట్లు భువనేశ్వరి తెలిపారు. ఏపీ ప్రజల హక్కుల కోసం చంద్రబాబు పోరాడుతున్నారు.. ఆయన పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలంటూ భువనేశ్వరి కోరారు. "ఒక బిడ్డకు మనసు బాలేనప్పుడు తల్లిదండ్రులు వద్దకు వెళతారు.. అందుకే నా బాధ చెప్పుకోవడానికే అమ్మవారి దగ్గరకు వచ్చాను.. చంద్రబాబుకు మనోధైర్యం ఇవ్వాలని దుర్గమ్మను కోరుకున్నా.. చంద్రబాబు పోరాటం ప్రజల స్వేచ్ఛకోసం.. చేయి చేయి కలిపి ప్రజలంతా ఏకమవ్వాలి.. మీరందరూ పోరాటం చేయాలి అది మీ హక్కు".. అంటూ భువనేశ్వరి పేర్కొన్నారు.

**ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు..**

నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ.. తమ కుటుంబానికి అందరి ఆశీస్సులు కావాలంటూ కోరారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు.. రాత్రికి రాత్రి చంద్రబాబును అరెస్టు చేయడం అన్యాయం.. అంతా మోసం.. చంద్రబాబు తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం శ్రమిస్తున్నారు.. ఏపీని వదిలేసి ముఖ్యమంత్రి విదేశాలకు తిరుగుతున్నారు.. అది మన దౌర్భాగ్యం అంటూ పేర్కొన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రి చేసి రాష్ట్రాన్ని నెంబర్ వన్‌లో నిలుపుదాం అంటూ రామకృష్ణ పేర్కొన్నారు.

## చంద్రబాబు నాయుడు అరెస్టుకు వైసీపీ పార్టీకి ఎటువంటి సంబంధం లేదు



నక్కపల్లి, (విశాఖ సమాచారమ్): మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను అరెస్టు చేయడం వైసిపి పార్టీకి ఎటువంటి సంబంధం లేదని మౌలిక సదుపాయాలు డైరెక్టర్ మరియు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ సీనియర్ వైసీపీ నాయకులు వీసం రామకృష్ణ అన్నారు. వైసిపి పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ చట్టం పని చట్టం చేసుకుంటుందని చంద్రబాబు నాయుడుకు ఒక న్యాయం జగన్మోహన్ రెడ్డికి ఒక న్యాయం ఉండదని చట్టం దృష్టిలో అందరూ సమానమే అని ఆయన అన్నారు సిల్క్ డెవలప్మెంట్ కార్పొరేషన్ 500 కోట్ల అవినీతి జరిగిందని దాని రికార్డుల్లో అవకతవకలు ఉండడంవల్ల ఏ వన్ ముద్దాయిగా చంద్రబాబునాయుడుని సిబిఐ అరెస్టు చేశారని ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని ఆయన అన్నారు. తెలుగుదేశం నాయకులు దీని గురించి మాట్లాడడం విడ్డురం గా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ మణి రాజు జడ్పిటిసి కాసులమ్మ పాపారావు తిరుపతిరావు వెంకటరమణ కొండ బుజ్జి గురునాథ్ గొర్ల గోవింద్ ముద్ద శ్రీను గ్రామ ఉపసర్పంచ్ వీసం రాజు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రీయ విద్యాలయ వాల్తేరు మిలాన్ 2023 పూర్వ విద్యార్థుల విద్యార్థి, ఉపాధ్యాయుల సమావేశం







**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కేంద్రీయ విద్యాలయ వాల్టెయిర్ పూర్వ విద్యార్థుల సంఘం 2023న మిలన్ 2023 పేరుతో 3వ పూర్వ విద్యార్థుల రీయూనియన్‌ని నిర్వహిస్తోంది. పాఠశాల 1980 సంవత్సరంలో ప్రారంభించబడింది, అప్పటి నుండి ఈ ఈవెంట్‌కు 500 మంది పూర్వ విద్యార్థులు హాజరవుతున్నారు... ఈ ఈవెంట్ కోసం యుఎస్ మరియు యుకె వంటి విదేశీ నుండి కొంతమంది పూర్వ విద్యార్థులు వస్తున్నారు. ఈ కార్యక్రమానికి 50 మందికి పైగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు హాజరుఅయ్యారు

1980లో స్థాపించబడిన కేంద్రీయ విద్యాలయ వాల్తేరు విశాఖపట్నంలో నాణ్యమైన విద్యకు ఒక వెలుగు వెలిగింది. ప్రభుత్వ పాఠశాలగా మరియు కేంద్రీయ విద్యాలయ సంగతన్‌లో భాగంగా, ఇది అనేక మంది విద్యార్థుల భవిష్యత్తును రూపొందించడంలో ముఖ్యమైన పాత్ర పోషించింది.

50 మంది రిటైర్డ్ సీనియర్ ఉపాధ్యాయులు, 50 మంది అంకితభావంతో పని చేస్తున్న ఉపాధ్యాయులు మరియు 1986 నుండి 2023 సంవత్సరాలలో విస్తరించి ఉన్న 10వ తరగతి బ్యాచ్‌ల నుండి 150 మంది పూర్వ విద్యార్థులు మరియు ప్రస్తుత విద్యార్థులు ఈ రీయూనియన్ కోసం ఎదురుచూస్తున్నారు. దాదాపు 400 మంది సభ్యుల కలయిక. గౌరవనీయులైన కల్నల్ విజయ్ బలరామ్, కన్వీనర్ కెవిడబ్ల్యూ మైలాన్ 2023 ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల కోర్ కమిటీ, కెవిడబ్ల్యూ యొక్క ప్రిన్సిపాల్, Mr. కమల్జీత్ యొక్క తిరుగులేని మద్దతుతో పాటు, ఈ ఈవెంట్‌ను చిరస్మరణీయమైనదిగా చేయడానికి అవిశ్రాంతంగా కృషి చేస్తోంది.

కెవిడబ్ల్యూ విద్యార్థుల లెక్కలేనన్ని భవిష్యత్తులను రూపొందించడంలో కీలకపాత్ర పోషించిన కెవిడబ్ల్యూ యొక్క అంకితభావంతో మరియు పదవీ విరమణ చేసిన పాత ఉపాధ్యాయులను ఈ ఈవెంట్ సత్కరిస్తుంది. పూర్వ విద్యార్థులు ఈ సంవత్సరం రెండు సెమిస్టర్‌ల కోసం 10 మంది విద్యార్థుల విద్యకు మద్దతుగా చెక్కును అందజేస్తారు, వారి ఆల్మా మేటర్‌పై వారి నిబద్ధతను బలోపేతం చేస్తారు.

కెవిడబ్ల్యూ మైలాన్ 2023 కేవలం పునఃకలయిక మాత్రమే కాదు ఇది భాగస్వామ్య అనుభవాలు, జీవితకాల స్నేహాలు మరియు విజయవంతమైన వ్యక్తులను రూపొందించిన విద్యా పునాది యొక్క వేడుక. మా ప్రయాణాలలో వివేకం మరియు మార్గనిర్దేశం చేసిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేయడానికి ఇది ఒక క్షణం.

ఈ కార్యక్రమంలో కన్వీనర్ విజయ బలరాం, రవి కిరణ్, సి వి రఘు, ఎన్‌వి సురూపహెద్, రాజ్ కుమారి,విజయ్ భాస్కర్, డి. భాస్కర్, అనిత, హమ్శీ, వాసు.మూర్తి,తదితరులు పాల్గొన్నారు.

# ఉపమాక వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి





**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):** పాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో ప్రసిద్ధ వైష్ణవ పుణ్యక్షేత్రం ఉత్తరాంధ్ర జిల్లాల భక్తుల కొంగు బంగారం అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం నాడు భక్తుల గోవింద నామస్మరణలతో మారుమ్రోగింది.

నిజ శ్రావణమాసం బహుళ దశమి శనివారం కావడంతో తూర్పుగోదావరి, ఉమ్మడి విశాఖ జిల్లాలో విజయనగరం ప్రాంతాల నుండి అనేకమంది భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున 5 గంటలకు ఆలయ అర్చకులు సంకర్షణ పల్లి రాజగోపాల కృష్ణమాచార్యులు ప్రత్యేక అభిషేకము నివేదనలు తీర్థ గోష్టి నిర్వహించారు.అనంతరం దేవస్థానం సిబ్బంది భక్తులందరకూ సర్వదర్శనం ఏర్పాట్లు చేశారు.కొండ దిగువన గల ఆలయంలో నిత్య కార్యక్రమంలు పూర్తి చేసిన తర్వాత భక్తులందరికీ దర్శన సౌకర్యం కల్పించారు.

అనంతరం సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు దాతలు సహాయంతో నిర్వహిస్తున్న ఉచిత అన్నదానంలో భాగంగా సుమారు వెయ్యి మందికి అన్నప్రసాదాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు అర్చకులు పీసపాటి వేంకట శేషాచార్యులు, భాగవతం గోపాలాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీనివాసులు, దేవస్థానం సిబ్బంది గురవయ్య, కొర్లాపు మహేష్, గ్రామానికి చెందిన రేజేటి సింగరాచార్యులు, గరగా చిన్న పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

# తెదేపా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అరెస్టు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో తెదేపా ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును పోలీసులు అరెస్టు చేశారు. ఇవాళ తెల్లవారుజామునే విశాఖలోని ఆయన నివాసానికి భారీగా పోలీసులు చేరుకున్నారు. దిశ ఏసీపీ వివేకానంద నేతృత్వంలో గంటా శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. ఎండాడలోని దిశ పోలీసు స్టేషన్‌కు ఆయణ్ని తరలించారు.

ఇదే కేసుకు సంబంధించి ఇప్పటికే తెదేపా అధినేత చంద్రబాబును సీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. నంద్యాలలో చంద్రబాబు బస చేసిన ప్రాంతంలో మూడు గంటల హైడ్రామా అనంతరం పోలీసులు ఆయనను అరెస్టు చేశారు.

# తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టుపై గవర్నర్ విస్మయం



**అమరావతి:** మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్షనేత చంద్రబాబు అరెస్టుపై సమాచారం ఇవ్వకపోవడం పట్ల ఏపీ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ విస్మయం వ్యక్తం చేశారు. అరెస్టు విషయంలో ప్రభుత్వ తీరుపై గవర్నర్ అసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం. అవినీతి నిరోధకర చట్టం-2018 సవరణల తర్వాత రాష్ట్రంలో ప్రజాప్రతినిధులు, అంతకుముందు మంత్రులుగా పనిచేసి వారు.. వారు నిర్వహించిన శాఖల్లో అవినీతి జరిగినట్టు ప్రభుత్వం దృష్టికి వస్తే వాటన్నింటినీ క్రోడీకరిస్తూ గవర్నర్‌కు నివేదిక సమర్పించాలి. ఆ తర్వాత గవర్నర్‌ను నుంచి అనుమతి తీసుకొని విచారణ చేపట్టాల్సి ఉంటుంది. కానీ, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టుపై రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్‌కు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు.

తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టు అక్రమం, చట్ట విరుద్ధమని ఇప్పటికే సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు స్పష్టం చేశారు. గవర్నర్ అనుమతి లేకుండా చంద్రబాబును అరెస్టు చేయడం, దర్యాప్తు చేపట్టడం చట్టవిరుద్ధమని చెప్పారు. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఎ(సి) ప్రకారం గవర్నర్ అనుమతి తప్పనిసరని వెల్లడించారు. ఒకవేళ గవర్నర్ అనుమతి తీసుకుని ఉంటే.. ఆ పత్రాలు చూపించాల్సి ఉంటుందని నాగేశ్వరరావు తెలిపారు. గవర్నర్ అనుమతి లేకపోతే దర్యాప్తు చెల్లుబాటు కాదని స్పష్టం చేశారు. గవర్నర్ అనుమతి లేకుండా అదుపులోకి తీసుకుంటే.. అక్రమ నిర్బంధం అవుతుందని తెలిపారు. ఆ చర్యకు పాల్పడిన పోలీసు అధికారులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.









VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776